RNI No : TELTEL/2022/85167

# పద్మక్రాంతి

(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

సంపుటి : 04 సంచిక : 186 రంగారెడ్డి ఎడిటర్ : గంజి వెంకటేశ్ బుధవారం, జూన్ 3, 2026 పేజీలు : 8 వెల: 3 రూ.

Volume: 04 Issue :186 Rangareddy Editor: Ganji Venkatesh Wednesday, June 3, 2026 Pages:8 Price: 3/-

## కర్నాటక సిఎంగా నేడు శివకుమార్ ప్రమాణం

- ఆయనతో పాటు మరో పదిమంది మంత్రులకు అవకాశం
- లోక్‌భవన్‌లో సాయంత్రం 4గంటలకు ప్రమాణ కార్యక్రమం
- రాహుల్ సహా పలువురు కాంగ్రెస్ నేతల హాజరు



బెంగళూరు,జూన్2(పద్మక్రాంతి): కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డీకే శివకుమార్ 3న బుధవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు మరో 10 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్ఠానంతో డీకే శివకుమార్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంగళవారంనాడు చర్చలు జరిపిన అనంతరం తొలివిడత క్యాబినెట్ కూర్పునకు సంబంధించిన కసరత్తు పూర్తయినట్టు చెబుతున్నారు. కొద్ది రోజుల వ్యవధిలోనే మంత్రివర్గ విస్తరణ కూడా ఉంటుందని ఆ వర్గాలు తెలిపాయి. బెంగళూరులోని లోక్ భవన్‌లో బుధవారం సాయంత్రం 4.05 గంటలకు ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుంది. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, పలువురు సీనియర్ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. డీకే శివకుమా-ర్‌తో పాటు ప్రమాణస్వీకారం చేసేవారిలో..కేజే జార్జ్, జి.పరమేశ్వర, రామలింగా రెడ్డి, కృష్ణ బైరేగౌడ, యూటీ ఖదెర్, మల్లనగౌడ బసనగౌడ పాటిల్, సతీష్ జార్కిహోళి, ప్రియాంక్ ఖర్గే, యతీంద్ర సిద్ధరామయ్య, లక్ష్మీ బెబ్బాల్కర్‌లు ఉన్నారు.



## ధైర్యానికి, సంకల్పానికి, పోరాట స్ఫూర్తికి తెలంగాణ ప్రతీక

- రాష్ట్ర ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు

న్యూఢిల్లీ,జూన్2(పద్మక్రాంతి):

తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. 'వికసిత్ భారత్' సంకల్పాన్ని సాకారం చేయడంలో భాగంగా.. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రస్థానానికి, ప్రగతి పథానికి కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ పూర్తి మద్దతునిస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. 'ఎక్స్'వేదికగా ప్రధాని మోదీ తెలంగాణ ప్రజలను ఉద్దేశించి ఒక ప్రత్యేక సందేశాన్ని పంచుకున్నారు. 'తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు. తెలంగాణ ప్రజలు తమ సృజనాత్మకతకు, వ్యాపార దృక్పథానికి ప్రసిద్ధులు. ఈ రాష్ట్రం ధైర్యానికి, సంకల్పానికి,పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన గొప్ప చరిత్ర, వైభవోపేతమైన సంస్కృతిని కలిగి ఉంది. వికసిత భారత్ అనే మన స్వప్నాన్ని సాకారం చేసే దిశగా తెలంగాణ అభివృద్ధి ప్రస్థానానికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించడానికి కట్టుబడి ఉంది. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ మంచి ఆరోగ్యం, సుఖసంతోషాలూ, విజయాలూ కలగాలని ప్రార్థిస్తున్నాను' అంటూ మోదీ తన సందేశంలో పేర్కొన్నారు.

## భారత్‌లో ఎబోలా టెన్షన్..

- ఒక కొత్త స్ట్రెయిన్ వేగంగా వ్యాప్తి
- అప్రమత్తమైన భారత ప్రభుత్వం




న్యూఢిల్లీ,జూన్2(పద్మక్రాంతి):

కాంగో, ఉగాండా తదితర ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వ్యాధి వేగంగా విస్తరిస్తున్న తరుణంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎబోలాలోని అత్యంత ప్రమాదకరమైన 'బుండిబుగ్యో' స్ట్రెయిన్ వేగంగా వ్యాపిస్తుండటంతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తాజా గైడ్‌లైన్స్ జారీ చేసింది. ముఖ్యంగా డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, దక్షిణ సుడాన్ దేశాలకు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు పెట్టుకోవద్దని భారతీయులను కోరినట్లు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో అధికారిక ప్రకటన ద్వారా చెప్పింది. తాజా పరిస్థితులపై ప్రపంచ ఆరోగ్య సంస్థ తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. మే 17, 2026న ఈ ఎబోలా వ్యాప్తిని 'పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీ ఆఫ్ ఇంటర్నేషనల్ కన్సర్న్' గా ప్రకటించింది. అలాగే ఆఫ్రికా సీడీసీ సైతం దీనిని ఖండాంతర భద్రతా ముప్పుగా పరిగణించిందని 'ద హిందూ' పత్రిక తన నివేదికలో తెలిపింది. ఈ ప్రమాదకర పరిణామాలను దృష్టిలో ఉంచుకుని మే చివరి వారంలో కేంద్ర ప్రభుత్వం 03

# తెలంగాణ కోటి రత్నాలవీణ

- త్వరలోనే జాబ్ నోటిఫికేషన్లు విడుదల
- టీజీపీఎస్సీ ద్వారా విడుదల చేస్తాం
- జాబ్ నోటిఫికేషన్ల జారీ నిరంతర ప్రక్రియ
- న్యాయపరమైన సమస్యలు లేకుండా భర్తీ
- 67 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశాం
- నిరుపేదల సొంతింటి కల సాకారం చేస్తాం
- అద్దె ఇళ్ల బాధల నుంచి విముక్తి చేస్తాం
- సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం
- విజన్-2047 లక్ష్యం దిశగా ముందుకు..
- కాళోజీ స్ఫూర్తితో అధికారం చేపట్టాం
- నాటి నుంచి రాష్ట్ర హితంకై శ్రమిస్తున్నాం
- రాచరికం, పెత్తనాన్ని సమాజం సహించదు
- నలుగురి చేతిలో ఉండే పెత్తనం కాదు
- ప్రజాకాంక్షలు నెరవేర్చే ప్రజా ప్రభుత్వం
- రుణమాఫీతో రైతులను రుణ విముక్తి చేశాం
- తొలి ఏడాదిలోనే రూ.22 వేల కోట్లు జమ
- తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి కృషి
- సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం చిత్తశుద్ధి
- కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేస్తాం
- మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దుతాం
- మహిళా సంఘాలకు సున్నా వడ్డీ రుణాలు
- రాష్ట్ర మహిళ దేశ పారిశ్రామికరంగంలో కీలకం
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి వెల్లడి
- ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ విషెస్
- ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహణ
- అమరవీరుల స్థూపానికి నివాళి అర్పించిన సీఎం



"రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం ఎప్పటికీ సహించదన్నారు. ప్రత్యేక తెలంగాణ కల సాకారం చేసిన నాటి ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీలకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ వేడుకలలో భాగంగా విధుల్లో ఉత్తమ సేవలు అందించిన పలువురు పోలీసు అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విశిష్టసేవా పురస్కారాలను ప్రదానం చేశారు. "పుట్టుక నీది, చావు నీది.. బతుకంతా దేశానిది" అన్న ప్రజాకవి కాళోజీ నారాయణరావు మాటలను సీఎం రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. కాళోజీ స్ఫూర్తితోనే తాము అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర ప్రజల హితం కోసం నిరంతరం శ్రమిస్తున్నామని, తమది ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రభుత్వం అన్నారు."



హైదరాబాద్, జూన్ 2(పద్మక్రాంతి):

తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా నిరుద్యోగ యువతకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. త్వరలోనే పలు జాబ్ నోటిషికేషన్లను టీజీపీఎస్సీ విడుదల చేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమానికి, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఇక్కడ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో వైభవంగా నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీఎం... రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం ఎప్పటికీ సహించదన్నారు. ప్రత్యేక తెలంగాణ కల సాకారం చేసిన నాటి ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీలకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ వేడుకలలో భాగంగా విధుల్లో ఉత్తమ సేవలు అందించిన పలువురు పోలీసు అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విశిష్టసేవా పురస్కారాలను ప్రదానం చేశారు. "పుట్టుక నీది, చావు నీది.. బతుకంతా దేశానిది" అన్న ప్రజాకవి కాళోజీ నారాయణరావు మాటలను సీఎం రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. కాళోజీ స్ఫూర్తితోనే తాము అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్ర ప్రజల హితం కోసం నిరంతరం శ్రమిస్తున్నామని, తమది ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రభుత్వం అన్నారు. గత 30 నెలల తమ పాలనలో ప్రజా సంకల్పాన్ని నిజం చేయడంలో విజయవంతం అయినట్లు పేర్కొన్నారు. తెలంగాణ విజన్-2047 లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని..



రాబోయే రోజుల్లో రాష్ట్ర రైతులను వ్యవసాయ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని ఈ వేదికగా హామీ ఇచ్చారు. ఎలాంటి న్యాయపరమైన సమస్యలు లేకుండా, అత్యంత పారదర్శకంగా ఇప్పటివరకు 67 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. ఈ సందర్భంగా నిరుద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త అందించారు. ఈ నెలలోనే టీజీపీఎస్సీ ద్వారా ఇంజినీరింగ్, పీసీబీ, అటవీశాఖ, టౌన్‌ప్లానింగ్, విద్యాశాఖల్లో ఖాళీలకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తామని ప్రకటించారు. ఉద్యోగాల నోటిఫికేషన్ల 03




## తెలంగాణ సంస్కృతిని ముందుకు తీసుకెళతాం

- అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది
- ఢిల్లీలో తెలంగాణ అవరతణ వేడుకల్లో నితిన్ నబీ

న్యూఢిల్లీ,జూన్2(పద్మక్రాంతి): తెలంగాణ అభివృద్ధి, సంస్కృతిని ముందుకు తీసుకువెళ్లాలన్నది బీజేపీ సంకల్పం' అని బిజెపి జాతాయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది. పీఎం కిసాన్ యోజన ,ముద్ర లోన్లు, జన్ ధన్ ఖాతాలు అందించాం. మౌలిక వసతులు,రోడ్లు,రహదారులు,రైల్వేలైన్లు ఏర్పాటు చేస్తున్నాం. వికసిత భారత్ కావాలంటే వికసిత తెలంగాణ కావాలి. ఒక అవినీతి పరుడు చేతుల్లోంచి మరో అవినీతి పరుడి చేతుల్లోకి వెళ్ళింది. తెలంగాణ కలలును సాకారం చేస్తాం' అని నితిన్ నబీన్ పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అలానే కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ 03

## సంక్షేమం నుంచి సంక్షోభంలోకి తెలంగాణ

పుష్కర తెలంగాణ కాస్తా ముష్కర తెలంగాణ

తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ నేత కెటిఆర్



హైదరాబాద్,జూన్2(పద్మక్రాంతి):

తెలంగాణ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, బీఆర్ఎస్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు తెలంగాణ కళాకారులకు కేటీఆర్ సన్మానం చేశారు.

అనంతరం పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన.. రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఒకప్పుడు అభివృద్ధి, సంక్షేమానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ ప్రస్తుతం సంక్షోభంలోకి నెట్టబడిందని అన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో నింపేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నో పాటలు రాశారని కేటీఆర్ గుర్తు చేశారు. ఉద్యమ ప్రస్థానంలో కేసీఆర్ అనేక పాత్రలు పోషించారని, తెలంగాణ సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేశారని పేర్కొన్నారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో ముందుకు సాగి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని అన్నారు. కేసీఆర్ జీవిత గాథపై సినిమా తీయాలని ఒక దర్శకుడు తనను కలిసిన సందర్భాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఆలోచిద్దామని కేసీఆర్ చెప్పారని, తెలంగాణ 03

## సర్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన

- పంటల వైవిధ్యంపై గ్రామసభల్లో రైతులకు సూచన
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎస్

హైదరాబాద్,జూన్2(పద్మక్రాంతి):



ఓటరు జాబితా పక్రియలో ప్రజలను భాగస్వాములను చేయాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కలెక్టర్లను ఆదేశించారు. 'సర్' పక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 4, 6, 9, 10 తేదీల్లో గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన వివరించారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై కలెక్టర్లలో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో పంటల వైవిధ్యతపై రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణంపైనా అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామసభల్లో పంటల వైవిధ్యీకరణపై రైతులకు సూచనలు చేయాలన్నారు. వర్షాకాల సన్నద్ధతపై ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. నీటి నిల్వల నివారణ, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ తెలిపారు. మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచాలని చెప్పారు. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను ప్రజలకు వివరించాలని 03

RNI No : TELTEL/2022/85167

పద్మక్రాంతి

(వాస్తవాలు వెలుగులోకి)

తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## పెట్రోల్ రేషనింగ్

# పెడితేనే మేలు !

చమురు మంటలు చల్లారేలా లేవు. ఇప్పటికే వరుసగా నాలుగుసార్లు పెట్రో ధరలను పెంచేశారు. వాణిజ్య సిలిండర్ ధరలు అమాంతంగా పైకి ఎగబాకాయి. పెట్రో సంక్షోభం ఇంకెన్నాళ్లో తెలియదు. అంతర్జాతీయం గా ముడి చమురు ధరలు పెరగడంతో భారత్ లాంటి దేశాలకు గుదిబండగా మారింది. ధరల దాడి ఇప్పట్లో ఆగేలా లేదు. పొదుపు మంత్రం పాటించిన ప్రధాని మోడీ అన్నింటా విఫలం అవుతోంది. పొదుపు ప్రభుత్వంలో కానరావడం లేదు. ధరలను అదుపు చేసే చిత్తశుద్ధి కనిపించడం లేదు. పెట్రో ధరలతో అన్ని వస–్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఉప్పులు, పప్పులు మొదలుకుని అన్నీ పెరుగుతున్నాయి. వంటనూనెల ధరలు సలసల కాగుతున్నాయి. వీటిపై సమీక్షించాల్సిన కేంద్రం మిన్నకుంది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగినా, వాటి డిమాండ్ తగ్గడం లేదు. ఎందుకంటే ప్రతి ఒక్కరికీ పెట్రో, డీజిల్, గ్యాస్ అనివార్యం అయ్యింది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగడంతో వినియోగదారులు వేరే సరుకుల కొనుగోలు తగ్గించి పెట్రో ఉత్పత్తులను కొనుగోలు చేస్తారు. అందుచేత పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగి నప్పుడు వాటి డిమాండ్ తగ్గకపోగా ఇతర సరుకుల డిమాండ్ పడిపోతుంది. దాని ఫలితంగా ఆర్థిక వ్యవస్థ మాంద్యం దిశగా అడుగులు వేస్తుంది. చమురు ఉత్పత్తుల సరఫరా ఎంతగా తగ్గితే అంతగా వాటి ధరలు పెరుగుతాయి. తగ్గిపోయిన సరఫరాకు తగ్గట్టు వాటి డిమాండ్ తగ్గిపోవాలంటే అంత ఎక్కువగా వాటి ధరలు పెరగాలి. అప్పుడు ఆర్థిక వ్యవస్థ అంత తీవ్రంగా మాంద్యంలో కూరుకుపోతుంది. దీనిపై ఆర్‌బిఐ గానీ, కేంద్రం కానీ సమీక్షించి చర్యలకు ఉపక్రమించడం లేదు. పశ్చిమాసియాలో సాగుతున్న యుద్ధంతో ప్రపంచ ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కు దాటేసింది. ప్రజలపైకి పెరిగిన చమురు భారాలను నెట్టడం అనివార్యంగా అనుసరిస్తున్నారు. ధరలు పెంయడం మినహా మిగతా చర్యలపై కేంద్రంలోని ఏ పాలకులు ఆలోచన చేయడం లేదు. దేశ ఆర్థిక వ్యవస్థ గురించి వారి అవగాహన రాహిత్యం ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవాలి. చమురు ధరలు పెరగడం అనేది దాని సరఫరా తగ్గినందువలన సంభవించేది కాదు. నిజానికి ఇప్పుడు ఒకవైపు యుద్ధం కొనసాగుతున్నా, చమురు నిల్వలు సరఫరాను కొనసాగించగల స్థాయిలోనే ఉన్నాయి. చమురు నిల్వలకు కొరత ఏర్పడబోతుందన్న అంచనాలతో ధరలు పెంచేస్తున్నారు. సరఫరా తగ్గడం, అంతర్‌ఆజతీయంగా బ్యారెల్ ధరలు పెరగడంతో ఆ భారం ప్రజలపై నెట్టేస్తున్నారు. వాస్తవానికి ఆర్థిక మాంద్యం వల్లే చమురు సరఫరాకు, డిమాండ్‌కు మధ్య సమతూకం ఏర్పడుతుంది. పెట్రో కొరత ఏర్పడినప్పుడు విచ్చలవిడి వినయోగాన్ని అదుపు చేయాలి. ప్రధానంగా సంపన్న వర్గాల వినియోగాన్ని నియంత్రించాలి. చమురు దిగుమతులు తగ్గినప్పుడు ఆ ప్రభావం వలన వినిమయం కూడా తగ్గిపోయి, ప్రత్యామ్నాయాల వైపు దృష్టి మళ్ళి దేశీయ ఉత్పత్తుల కోసం డిమాండ్ పెరుగుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థ మీద ఈ విధానం ప్రభావం చూపుతుంది. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరిగినప్పుడు దేశీయంగా పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచకపోతే ఆ పెట్రో ఉత్పత్తులను దేశీయంగా ఉత్పత్తి చేసేవారు. పంపిణీ చేసేవారు నష్టపోతారు. ఆ నష్టాన్ని ప్రభుత్వం సబ్సిడీ ద్వారా భరించవచ్చు. అప్పుడు చమురు దిగుమతులకు మనం డాలర్ల రూపంలో చెల్లించవలసినది 8 శాతం పెరుగుతుంది. పెట్రో ఉత్పత్తుల రేషనింగ్ ద్వారా సంపన్నుల వినిమయాన్ని అదుపు చేస్తే అప్పుడు వారి వినిమయం వేరే ఉత్పత్తులవైపు మరలుతుంది. ఉపాధి కూడా పెరగవచ్చు. అంతే కాదు, శ్రామిక ప్రజల కొనుగోలు శక్తి, జీవన ప్రమాణాలు పడిపోకుండా నిలబడతాయి. కేవలం సంపన్నుల వినిమయాన్ని మాత్రమే రేషనింగ్ ద్వారా అదుపు చేస్తే దానివల్లే పెట్రో వినిమయం అవసరమైన మోతాదు మేరకు తగ్గిపోతుందని కూడా చెప్పలేము. ఇది అందరికీ

వర్తించాలి. ఇక్కడ మోడీ ప్రకటించిన పొదుపును అందరూ పాటించేలా తప్పనిసరి చేయాలి.


పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచడం గాని, తద్వారా కోట్లాదిమంది ప్రజల మీద భారాలను మోపడం కాని, దేశ ఆర్థిక వ్యవస్థలో మాంద్యం పెరగడానికి దోహదపడుతుంది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరగడంతో, తక్కిన ఉత్పత్తుల వినియోగం బాగా తగ్గిపోయింది. పైగా వినియోగదారులే పెట్రో ధరల పెంపు భారాన్ని కూడా భరించవలసి వచ్చింది. దాంతో సర్వత్రా ద్రవ్యోల్బణ పరిస్థితులు నెలకొన్నాయి. ఢిల్లీలో కాలుష్యాన్ని కంట్రోల్ చేయడానికి వాహనాలపై ఆంక్షలు విధించారు. ఇప్పుడు పెట్రోల్ కోసం కూడా ఇలా అంక్షలు విధించి ప్రజలను భాగస్వాములను చేయాలి. తగిన పద్ధతిలో కట్టుదిట్టంగా దానిని అమలు చేయడం సాధ్యమే. ఇలా చయడంతో పాటు, కాలర్ల అమ్మకాలనపైనా ఆంక్షలు విధించాలి. దీంతో పెట్రో ఆదాతో పాటు, కాలుష్యం కూడా తగ్గగలదు. ఎన్నో ప్రత్యమ్నాయ పద్దతులను అధ్యయనం చేయాల్సి ఉంది. అప్పుడే ధరల భారాన్ని ప్రజలపై పడకుండా చూడవచ్చు. నిల్వలు కరిగిపోకుండా చేయవచ్చు.

# సీబీఎస్‌ఈ అన్ స్క్రీన్ మార్కింగ్ వివాదం

- నివేదిక కోరిన కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ,జూన్2 (పద్మక్రాంతి):**

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఆన్–స్క్రీన్ మార్కింగ్ కు సంబంధించిన వివాదం మరింత ముదురుతోంది. కోఎంప్ట్ ఎడ్యుటెక్ సంస్థకు కాంట్రాక్ట్ కేటాయించిన విధానంపై సీబీఎస్‌ఈ నుంచి కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పూర్తి నివేదిక కోరింది. ఈ వ్యవహారంలో అవకతవకలు జరిగాయని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్రం హెచ్చరించింది. కోఎంప్ట్ కు కాంట్రాక్టును కేటాయించేటప్పుడు అనుసరించిన విధానాలు, నిర్ణయం తీసుకునే పక్రియలో పాల్గొన్న అధికారులతో సహా, టెండర్ పక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను అందించాలని సీబీఎస్‌ఈని మంత్రిత్వ శాఖ



కోరింది. తొలిసారిగా అమలు చేసిన ఆన్–స్క్రీన్ మార్కింగ్ విధానంపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి వేల ఫిర్యాదులు వచ్చాయి. కొన్ని సమాధాన పత్రాలు సరిగా స్కాన్ కాకపోవడం, పేజీలు కనిపించకపోవడం, మార్కుల లెక్కల్లో పొరపాట్లు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. కొన్ని వేల జవాబు పత్రాలను తిరిగి మాన్యువల్‌గా మూల్యాంకనం చేయాల్సి వచ్చింది . వివాదం రాజకీయ రంగు కూడా పులుముకుంది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు (అః÷ూఇ బి।నిట।స ఇనీనిబిసనీల।సబా). ఓఎస్ఎమ్ టెండర్ పక్రియలో మార్పులు చేసి కోఎంప్ట్‌కు అనుకూలంగా నిబంధనలను సడలించారని ఆరోపించారు. టెండర్ నిబంధనల్లో పలు మార్పులు జరిగాయని, దీంతో సంస్థకు అర్హత లభించిందని ఆయన పేర్కొన్నారు. సీబీఎస్‌ఈ ఈ ఆరోపణలను ఖండించింది. అన్ని నిబంధనలను అనుసరించే కాంట్రాక్ట్ కేటాయించామని, ఎలాంటి అవకతవకలూ జరగలేదని పేర్కొంది. ఈ మొత్తం వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ అంతర్గత విచారణకు ఆదేశించింది.

# మరోసారి తీవ్రస్థాయికి ఉద్రిక్తతలు

- పశ్చిమ ఆసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు
- కొలిక్కిరాని దౌత్యపరమైన ప్రయత్నాలు
- చర్చలు నిలిపేస్తున్నామని ఇరాన్ ప్రకటన
- 'హోర్ముజ్' జలసంధిని పూర్తిగా మూసివేత!!

**న్యూఢిల్లీ,జూన్2(పద్మక్రాంతి):**

పశ్చిమ ఆసియా (మిడిల్ ఈస్ట్)లో ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరుకున్నాయి. లెబనాన్‌లో ఇజ్రాయెల్ తన సైనిక చర్యలను మరింత విస్తృతం చేయడాన్ని నిరసిస్తూ.. అమెరికాతో మధ్యవర్తుల ద్వారా జరుగుతున్న దౌత్యపరమైన చర్చలను ఇరాన్ సోమవారం రద్దు చేసుకుంది. ఈ మేరకు ఇరాన్ అధికారిక వార్తా సంస్థ 'తస్నిమ్' ఒక ప్రకటన విడుదల చేసింది. పశ్చిమ ఆసియాలో యుద్ధాన్ని ముగించడానికి జరుగుతున్న దౌత్యపరమైన ప్రయత్నాలు పూర్తిగా స్తంభించిపోవడంతో ఇరాన్ చర్చల బృందం ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సదరు వార్తా సంస్థ పేర్కొంది. ఈ చర్చల నిలిపివేతపై ఇరాన్ ప్రతినిధులు స్పందిస్తూ.. "లెబనాన్‌లో ఇజ్రాయెల్ నిరంతరం సాగిస్తున్న అకృత్యాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నాం. కాల్పుల విరమణ ఒప్పందానికి లెబనాన్ అంశం ఒక ముఖ్యమైన ముందస్తు షరతు. కానీ ఇప్పుడు లెబనాన్‌తో సహా అన్ని రంగాలలోనూ ఈ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘించింది. అందుకే మధ్యవర్తుల ద్వారా అమెరికాతో జరుపుతున్న చర్చలను, పత్రాల మార్పిడిని ఇరాన్ బృందం తాత్కాలికంగా నిలిపివేస్తోంది" అని తస్నిమ్ నివేదించింది. ఆక్రమిత ప్రాంతాల నుండి ఇజ్రాయెల్ దళాలు పూర్తిగా వెనక్కి వెళ్లాలని, అలాగే గాజా, లెబనాన్‌లలో సైనిక చర్యలను పూర్తిగా నిలిపివేయాలనే తమ డిమాండ్లు నెరవేరే వరకు అమెరికాతో దౌత్యపరమైన చర్చలను తిరిగి ప్రారంభించే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఈ నిర్ణయానికి కొద్దిసేపటి ముందే ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చీ సోషల్ మీడియా వేదికగా అమెరికా, ఇజ్రాయెల్‌లను హెచ్చరించారు. లెబనాన్‌లో ఉద్రిక్తతలు పెంచడం అంటే.. అమెరికాతో కుదిరిన విస్తృత కాల్పుల విరమణ నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందని ఆయన స్పష్టం చేశారు. "ఇరాన్–అమెరికా మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అనేది నిస్సందేహంగా లెబనాన్‌తో సహా అన్ని రంగాలకు వర్తిస్తుంది. ఏదైనా ఒక రంగంలో దీనిని ఉల్లంఘిస్తే, అది అన్ని వైపులా ఉల్లంఘించినట్లే అవుతుంది. దీనివల్ల వచ్చే పరిణామాలకు అమెరికా, ఇజ్రాయెల్ దేశాలే పూర్తి




బాధ్యత వహించాల్సి ఉంటుంది." అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చీ పేర్కొన్నారు. అమెరికాతో దౌత్య సంబంధాలు తెంచుకోవడంతో పాటు, ఇరాన్ తన కూటమి దేశాలతో కలిసి అంతర్జాతీయంగా అత్యంత కీలకమైన 'స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్'ను పూర్తిగా స్తంభించిపోయేలా చేయడానికి కార్యాచరణ సిద్ధం చేసినట్లు ప్రకటించింది. దీనితో పాటు ఎర్రసముద్రంలోని 'బాబ్ ఎల్ మండేబ్'జలసంధి లోనూ ఇతర వ్యూహాత్మక పంథాలను అస్త్రాలుగా మార్చి, ఇజ్రాయెల్ మరియు దానికి మద్దతు ఇస్తున్న దేశాలను ఆర్థికంగా, సైనికంగా 'శిక్షించాలని' ఇరాన్ కూటమి నిర్ణయించింది. గాజా, లెబనాన్‌లలో ఇజ్రాయెల్ క్రూరమైన ఆర్మీ ఆపరేషన్లను తక్షణమే ఆపాలని, లేదంటే ఈ ప్రతిఘటన మరింత తీవ్రంగా ఉంటుందని ఇరాన్ పట్టుబడుతోంది. ఈ పరిణామాల వల్ల అంతర్జాతీయ చమురు సరఫరాకు మరియు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఐరాస సంస్కరణల్లో సభ్య దేశాలు కీలకం

- సభ్య దేశాల ప్రాధాన్యత, పారదర్శకత అవసరం
- ఐరాసాలో భారత శాశ్వత ప్రతినిధి వెల్లడి

**న్యూఢిల్లీ,జూన్2(పద్మక్రాంతి):**

ఐక్యరాజ్యసమితి చేపడుతున్న సంస్కరణల సందర్భంగా సభ్య దేశాల ప్రాధాన్యతలకు అత్యున్నత స్థానం కల్పించాలని భారత్ స్పష్టం చేసింది. ప్రపంచ అభివృద్ధి కార్యక్రమాల్లో ఆ దేశాల జాతీయ యాజమాన్యాలే కేంద్రబిందువుగా కొనసాగాలని ఐరాసాలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ పేర్కొన్నారు. ఐరాస ఆర్థిక, సామాజిక మండలి (ఈసీఓఎస్?ఓసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన అభివృద్ధి కార్యకలాపాల విభాగ సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఐరాస డిప్యూటీ సెక్రటరీ, యునైటెడ్ నేషన్స్ సస్టైయినబుల్ డెవలప్‌మెంట్ గ్రూప్ చైర్ అమీనా జె. మహమ్మద్‌తో చర్చలు జరిపినట్లు హరీశ్ తెలిపారు. ఐరాస కార్యకలాపాల్లో అభివృద్ధి విభాగానికి ఉన్న ప్రాధాన్యతను కొనసాగించాలని పర్వతనేని హరీశ్ కోరారు. అభివృద్ధి కార్యక్రమాలు ఆయా దేశాల అవసరాలు, ప్రాధాన్యతలు, విధానాల ఆధారంగానే అమలు కావాలని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలంటే వాటి రూపకల్పన, అమలులో సభ్య దేశాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అందుకే సభ్య దేశాల జాతీయ భావనను ఎట్టి పరిస్థితుల్లోనూ బలహీనపరచకూడదని స్పష్టం చేశారు. ఇక ఐరాస రెసిడెంట్ కోఆర్డినేటర్ వ్యవస్థలో చేపట్టే మార్పులు, సంస్కరణలు సభ్య దేశాల అభివృద్ధి లక్ష్యాలకు మరింత సహకరించేలా ఉండాలని పర్వతనేని హరీశ్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం కొనసాగుతున్న చర్చలు అభివృద్ధి కార్యక్రమాల సామర్థ్యాన్ని పెంచే దిశగా సాగాలని సూచించారు. ఏమైనా పునర్?వ్యవస్థీకరణలు చేపట్టినా అవి దేశాలకు అందించే అభివృద్ధి సహాయాన్ని బలోపేతం చేయాలని అన్నారు. అలాగే కార్యక్రమాల అమల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ఉండాలని పర్వతనేని హరీశ్ పేర్కొన్నారు. రెసిడెంట్ కోఆర్డినేటర్ వ్యవస్థ భవిష్యత్ నిధుల సమీకరణ, పాలన విధానాలపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో పారదర్శకత, జవాబుదారీతనం అత్యంత అవసరమని తెలిపారు. ఈ వ్యవస్థ ద్వారా సభ్య దేశాలకు ఎంత మేర ప్రయోజనం కలుగుతోందో సమగ్రంగా అంచనా వేయాలని సూచించింది. అభివృద్ధి కార్యక్రమాలపై వాస్తవ ప్రభావాన్ని విశ్లేషించిన తర్వాతే భవిష్యత్ నిర్ణయాలు తీసుకోవాలని భారత్ కోరింది. 1948 నుంచి ఐరాస శాంతి భద్రతా కార్యక్రమాల్లో భారత్ కీలక భాగస్వామిగా కొనసాగుతోందని శాశ్వత మిషన్ తెలిపింది. ఇప్పటివరకు 50కి పైగా ఐరాస శాంతి మిషన్లకు దాదాపు మూడు లక్షల మంది భారత సైనికులను పంపిందని పేర్కొంది. అంతర్జాతీయ శాంతి, భద్రతల పరిరక్షణ కోసం 184 మంది భారతీ–య శాంతి భద్రతా సిబ్బంది అత్యున్నత త్యాగం చేసినట్లు భారత శాశ్వత మిషన్ వెల్లడించింది. ఈ సందర్భంగా 2025 సంవత్సరానికి గాను 'మిలిటరీ జెండర్ అడ్వకేట్ ఆఫ్ ది ఇయర్ అవార్డు' అందుకున్న మేజర్ అభిలాష బరాక్‌ను కూడా ఐరాస సత్కరించింది. ప్రస్తుతం ఆమె లెబనాన్‌లోని ఐరాస తాత్కాలిక దళంలో విధులు నిర్వహిస్తున్నారు.

# బంగ్లాదేశ్‌కు లక్షల మంది చొరబాటుదారులు

**బెంగాల్ నుంచి వెళ్లిపోతున్న అక్రమదారులు**

**సోనార్‌పూర్, జూన్ 2(పద్మక్రాంతి):**

బంగ్లాదేశ్ నుంచి మన దేశంలోకి అక్రమంగా వలస వచ్చిన వారు తిరిగి వెళ్లడంపై దేశవ్యాప్తంగా భిన్నమైన చర్చ జరుగుతోంది. పాతికేళ్లకిందట వచ్చి ఇక్కడే కుటుంబాలను ఏర్పాటు చేసుకున్న వారిపై సానుభూతి చూపించాలని కొంత మంది అంటున్నారు. అయితే వారిని వెనక్కి పంపేయాలని చాలా మంది అభిప్రా–యపడుతున్నారు. బంగ్లాదేశ్ ఏర్పడిన 1971 యుద్ధం తర్వాత మొదలైన వలసల పరంపర నేటికీ ఆగలేదు. వివిధ ప్రభుత్వ నివేదికలు . అంతర్గత విశ్లేషణల ప్రకారం, భారతదేశంలో ప్రస్తుతం సుమారు 1.5 కోట్ల నుండి 2 కోట్ల మంది అక్రమ బంగ్లాదేశ్ పౌరులు నివసిస్తున్నారని అంచనా. కేవలం పశ్చిమ బెంగాల్‌లోనే ఏటా లక్షలాది మంది సరిహద్దులు దాటుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. దశాబ్దాల క్రితం వచ్చిన వారు ఇక్కడి స్థానిక రాజకీయ అండదండలతో రేషన్ కార్డులు, ఓటర్ ఐడీలు, ఆధార్ కార్డులు వంటి ఫోర్జరీ పత్రాలు సృష్టించుకుని భారతీ–య పౌరులుగా చలామణి అవుతుండటం ఇప్పుడు అసలు చిక్కుగా మారింది. ఇంత పెద్ద ఎత్తున చొరబాట్లు జరుగుతున్నా ఇన్నాళ్లూ ఎందుకు ఉపేక్షించారన్న దానికి ప్రధాన కారణం ఓటు బ్యాంక్ రాజకీయం. సరిహద్దు రాష్ట్రాల్లోని కొన్ని రాజకీయ పార్టీలు ఈ చొరబాటుదారులను తమ శాశ్వత ఓటు బ్యాంకులుగా మార్చుకోవడానికి వారికి రక్షణ కల్పించడమే కాకుండా, భారతీయ గుర్తింపు పత్రాలు లభించేలా సహకరించాయి. 4,096 కిలోమీటర్ల పొడవైన భారత్–బంగ్లాదేశ్ సరిహద్దులో చాలా ప్రాంతం నదీ తీరాలు, చిత్తడి నేలలు కావడం కూడా చొరబాటుదారులకు వరంగా మారింది. ఆర్థిక ఇబ్బందులు, మతపరమైన వేధింపులు , మెరుగైన ఉపాధి కోసం బంగ్లాదేశీయులు భారత్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. మన దేశంలోని వనరులు మన పౌరులకే సరిపోని తరుణంలో, కోట్లాది మంది అక్రమ వలసదారులకు ఉచిత రేషన్, వైద్యం, విద్య, గృహనిర్మాణ పథకాలు కల్పించడం దేశ ఆర్థిక వ్యవస్థకు పెను భారం. సామాన్య భారతీ–యుడు చెల్లించే పన్నుల ద్వారా లభించే సంక్షేమ ఫలాలు చొరబాటుదారుల పాలవ్వడం ప్రజాస్వామ్య విరుద్ధమనే వాదన ఇప్పుడు బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, అస్సాం వంటి రాష్ట్రాల్లో జనాభా మార్పిడి జరిగి, స్థానిక భూమిపుత్రులు మైనారిటీలుగా మారుతున్నారనే ఆందోళన పెరుగుతోంది. మానవతా దృక్పథం పేరుతో



సానుభూతి చూపే వారు.. వీరు పాతికేళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నారని, వారి పిల్లలు ఇక్కడే పుట్టారని వాదిస్తున్నారు. అయితే, చట్టపరంగా చూస్తే అక్రమ ప్రవేశం ఎప్పటికీ అక్రమమే అవుతుంది. అక్రమంగా వచ్చిన వారు మన దేశం పట్ల విధేయులుగా ఉంటారని గ్యారెంటీ లేదు. దేశ భద్రతా కోణంలో చూస్తే, ఉగ్రవాద మూలాలున్న శక్తులు ఈ చొరబాటుదారుల ముసుగులో దేశంలోకి ప్రవేశించే ప్రమాదం ఉంది. జాతీయ భద్రత, పౌరుల ప్రయోజనాల ముందు వ్యక్తిగత సానుభూతికి తావు లేదని ఢిల్లీ పెద్దలు డిటెక్ట్, డిలీట్, డిపోర్ట్ విధానాన్ని వేగవంతం చేస్తున్నారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన హోల్డింగ్ సెంటర్ల ఏర్పాటు చేయడంతో బంగ్లాదేశీయులు.. స్వదేశానికి వెళ్లిపోతున్నారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

# సంక్షేమం నుంచి సంక్షోభంలోకి తెలంగాణ

మొదటి పేజీ తరువాయి ..

ఆవిర్భావం అనేది అన్ని ప్రతికూల పరిస్థితులను ఛేదించి సాధించిన చారిత్రక విజయమని ఆ దర్శకుడు అభిప్రాయపడ్డారని తెలిపారు. కేసీఆర్ అనే మూడు అక్షరాల ముందు 'ముఖ్యమంత్రి' అనే పదవి చాలా చిన్నదిగా కనిపిస్తుందని ఆయన వ్యాఖ్యానించినట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసిన కేటీఆర్.. 'పుష్కర తెలంగాణ ఇప్పుడు ముష్క-రుల తెలంగాణగా మారిపోయింది. నిష్ఫల తెలంగాణగా మారిపోయింది' అని విమర్శించారు. తెలంగాణ సాధన కోసం పదవిని మాత్రమే కాదు.. అవసరమైతే ప్రాణత్యాగానికీ సిద్ధపడ్డ నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్యతో బాధపడిన ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించి వేలాది కుటుంబాల కష్టాలను తీర్చిన నాయకుడు కేసీఆర్ కాదా అని



ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొందరు ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారని ఆరోపించారు. రాజకీయ పరిస్థితులపై స్పందిస్తూ.. 2014, 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటరిగానే విజయం సాధించిందని, 2023 ఎన్నికల్లో కూడా ఒంటరిగానే పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అడ్డదారిలో అధికారంలోకి వచ్చిందని ఆరోపిస్తూ, ప్రస్తుతం రాష్టాన్ని వెనక్కి నెట్టే విధంగా పాలన సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేస్తూ.. గ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక, పరిపాలనా వ్యవస్థలను దెబ్బతీస్తోందని ఆరోపించారు. 'వడ్డించిన విస్తరి లాంటి తెలంగాణను కుక్కలు చింపిన విస్తరిగా మార్చుతున్నారు' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సంక్షేమం, అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలిచిన తెలంగాణ ప్రస్తుతం సంక్షోభంలో కూరుకుపోయిందని కేటీఆర్ అన్నారు. అయితే ఈ పరిస్థితులు శాశ్వతం కాదని, 2028 డిసెంబర్‌లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌కు అవకాశం ఇస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# తెలంగాణ కోటి రత్నాలవీణ




మొదటి పేజీ తరువాయి ..

జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన





జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, విద్యా రంగంలో భాగంగా ఇప్పటికే 1,362 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ క్లాసులు ప్రారంభించామన్నారు. ఈ ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని, త్వరలోనే జూనియర్ కాలేజీల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అద్దె ఇళ్ల బాధలు, కష్టాల నుండి పేదలకు విముక్తి కలిగించేందుకు గత 13 నెలల కాలంలో 1.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించగా, ఇందుకోసం రూ.22 వేల కోట్లు ఖర్చు చేశామని ఆయన తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 3.50 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, ఈసారి క్యూఆర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని చెప్పారు. కొత్త రేషన్‌కార్డులను కూడా పంపిణీ చేసి ప్రజల సమస్యలకు పరిష్కారం చూ-పామన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ఈ ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని సీఎం వెల్లడించారు. ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాచరికాన్ని, పెత్తనాన్ని తెలంగాణ సమాజం సహించదన్న రేవంత్, ప్రభుత్వం అంటేనే నలుగురి చేతిలో ఉండే పెత్తనం కాదని స్పష్టం చేశారు. తమది ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే ప్రజా ప్రభుత్వమన్న సీఎం, గత 30 నెలల్లో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో విజయవంతం అయ్యామన్నారు. తెలంగాణ విజన్-2047 లక్ష్యం సాధించే దిశగా వెళు_న్నామని స్పష్టం చేశారు. రైతులను వ్యవసాయ పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశ-ారు.సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం తెలిపారు. జలయజ్ఞంలో చేపట్టిన ప్రాజెక్టులు పదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి మళ్లీ కృషి చేస్తున్నామని చెప్పారు. రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిందని సీఎం ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఒకేసారి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి రైతులను రుణ విముక్తి చేశామని సీఎం తెలిపారు. తొలి ఏడాదిలోనే రైతుల ఖాతాల్లో రూ.22 వేల కోట్లు జమ చేసినట్లు చెప్పారు. రైతుల పంటలు చివరి గింజ వరకు కొనేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బు రూ.11,300 కోట్లు జమ చేశామని తెలిపారు.మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు ప్రణాళికలు వేస్తున్నట్లు రేవంత్? రెడ్డి తెలిపారు. మహిళా సంఘాలకు రూ.60 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు ఇచ్చామని చెప్పారు. తెలంగాణ మహిళ దేశ పారిశ్రామికరంగంలో కీలకంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలు రూ.10 వేల కోట్లు ఆదా చేసుకున్నారన్న ముఖ్యమంత్రి, 53.90 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని గుర్తుచేశారు. రెండున్నరేళ్లలో ప్రజల ఆశలు, ఆశయాలను నెరవేర్చడంలో విజయం సాధించాం. రాష్ట్రంలో రైతుల్ని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నాం. గత ప్రభుత్వం లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలిపోయింది. మరమ్మతులు చేయించే భారం ప్రభుత్వంపై పడింది. ఉద్యోగాల భర్తీ ప్రక్రియను విజయవంతంగా చేపట్టాం. రికార్డు సమయంలో 67,763 పోస్టులను భర్తీ చేశాం. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ద్వారా విద్యా వ్యవస్థ మరి బలోపేతం కానుంది. పేదలను అద్దె బాధలనుంచి విముక్తి చేయాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు.

కాగా.. తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. సీఎం రేవంత్ రెడ్డి ముందుగా అసెంబ్లీ సమీపంలోని గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాల్లో సంబంధిత మంత్రులు జాతీయ జెండా ఆవిష్కరించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాత్రి వేళల్లో హైదరాబాద్‌లోని సచివాలయం, అసెంబ్లీ భవనాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మంలో మాట్లాడుతూ తొలి విడతలో 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, రూ.22 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. 53.90 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని గుర్తుచేశారు. హనుమకొండలో అమరవీరుల స్థూపానికి రెవె-న్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వద్ద నివాళి అర్పించి జెండాను ఆవిష్కరించారు. నల్గొండ క్లాక్ టవర్ కూడలి వద్ద అమరవీరుల స్థూపానికి రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నివాళి అర్పించారు. తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి విగ్రహానికి పుష్పాలతో నివాళి అర్పించారు. అనంతరం పోలీసు పరేడ్ మైదానంలో జాతీయపతాకావిష్కరణ చేశారు. నల్గొండలోని కలెక్టరేట్?లో ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. అమరవీరుల త్యాగ ఫలితమే మన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమని తెలిపారు. తెలంగాణ చరిత్ర గురించి మాట్లాడాలంటే నల్గొండ ప్రస్తావన లేకుండా ఒక్క పేజీ కూడా ముందుకు సాగదన్నారు. నల్గొండ కేవలం జిల్లా కాదని విప్లవాల పురిటి గడ్డ, అన్యాయంపై తిరగబడ్డ వీరుల అడ్డా అని వెంకట్?రెడ్డి చెప్పారు. నా భూమి జోలికొస్తే ఆ భూమిలోనే నీ గోరి కడతాం అని దొరల గుండెల్లో వణుకు పుట్టించిందన్నారు. నల్గొండ గడ్డ మన పిల్లలు లాఠీ దెబ్బలు తింటే, శ్రీకాంతాచారి తన ప్రాణాన్ని త్యాగం చేస్తుంటే చూస్తూ ఊరుకోలేదని అన్నారు. తానెప్పుడూ పదవుల కోసం ఆశపడలేదని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్ష నెరవేరకపోతే ఈ పదవులు ఎందుకని నాడు మంత్రి పదవిని విసిరికొట్టి ఉద్యమంలోకి దిగిన చరిత్ర తనదన్నారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్‌కు తిరుగు లేదు

- తమతో పోటీకి దిగే ప్రత్యర్థులే లేరు
- రాష్ట్ర అభివృద్ధికి కేబినెట్ జట్టుగా పనిచేస్తోంది
- తామంతా నూరుశాతం చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం
- ధాన్యం సేకరణ వైఫల్యం మమ్మాటికీ బిజెపిదే
- మీడియతో డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క

ఖమ్మం,జూన్2(పద్మక్రాంతి):

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై మీడియా దృష్టి పెట్టాలని.. ఓట్లు గల్లంతు కాకుండా చూసుకోవాలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ప్రతి ఒక్కరూ సర్ మ్యాపింగ్‌పై దృష్టి పెట్టాలన్నారు. తెలంగాణ అవతరణ వేడుకల అనంతరం ఆయన మీడియాతో
చిట్‌చాట్‌గా మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యర్థులే లేరని వ్యాఖ్యానించారు. 'రైతు వ్యతిరేక పార్టీ భాజపానే. పని చేసే పార్టీలకు ప్రచారం అవసరం లేదు. అసెంబ్లీ, ఎంపీ, మున్సిపల్ ఎన్నికల్లో మా సత్తా చూపించాం. జిల్లా పరిషత్ ఎన్నికలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని భట్టి విక్రమార్క తెలిపారు. ఇకపోతే తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు కేటాయించే అంశంపై ప్రభుత్వం చాలా బలంగా ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రస్తుత తెలంగాణ మంత్రివర్గం రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒక టీమ్‌లా అద్భుతంగా పనిచేస్తోందని డిప్యూటీ సీఎం కొనియాడారు. అందరి లక్ష్యం తెలంగాణ అభివృద్ధి మాత్రమేనని, క్షేత్రస్థాయిలో పనిచేసే



పార్టీలకు ఎలాంటి ఆర్భాటపు ప్రచారాలు అవసరం లేదని, ప్రజలకు సేవ చేయడమే తమ మొదటి ప్రాధాన్యతని స్పష్టం చేశారు. అసెంబ్లీ, లోక్‌సభ , మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తన సత్తా చాటుకుందని గుర్తు చేస్తూ.. ప్రస్తుత ప్రభుత్వ పాలనకు తాను వంద శాతం మార్కులు వేస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఇదే ఊపుతో రాబోయే జిల్లా పరిషత్ ఎన్నికలపై కూడా ప్రభుత్వం త్వరలోనే సరైన నిర్ణయం తీసుకుంటుందని, 2028 లో జరిగే తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ప్రత్యర్థులే ఎవరూ లేరని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు, రాజకీయ పరిణామాలు , ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. జర్నలిస్టుల ఇళ్ల సమస్య పరిష్కారం కోసం ప్రత్యేకంగా అధికారులు పనిచేస్తున్నారని, దీనిపై ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో 'రాజీవ్ ఆరోగ్యశ్రీ' పథకం అత్యంత అద్భుతంగా నడుస్తోందని, ప్రజలందరూ ఈ ఉచిత వైద్య సదుపా-



యాన్ని సద్వినియోగం చేసుకోవాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఈ పథకం సజావుగా సాగడం కోసం ప్రభుత్వం ప్రతి నెలా 150 కోట్ల నిధులను కేటాయిస్తోందని వెల్లడించారు. ఈ పథకం ద్వారా పేదలకు 10 లక్షల వరకు వైద్య బీమా కవరేజ్ లభిస్తుందని, ప్రభుత్వంలో పూర్తి బాధ్యతాయుతమైన విధివిధానాలు ఉన్నాయని చెప్పారు. వైద్య సేవలను మరింత బలోపేతం చేయడానికి వీలుగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులలో కొత్తగా 10 వేల బెడ్‌లను పెంచుతున్నట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్రంలో రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ కరెంట్ మీటర్లు పెట్టబోమని, ఉచిత కరెంట్ అందించి తీరుతామని ముఖ్యమంత్రి చేసిన ప్రకటనపై ప్రతిపక్షాలు నోరు మెదపకపోవడమే భవిష్యత్తులో తమ విజయానికి నిదర్శనమని భట్టి విక్రమార్క అన్నారు. అలాగే, సమాజంలో ఓట్ల గల్లంతు వ్యవ-హారంపై మీడియా ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఓటర్ల మ్యాపింగ్ , అన్-మ్యాపింగ్ పక్రియలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్న 'ఇందిరమ్మ జీవిత బీమా పథకం' రాష్ట్రంలోని లబ్దిదారులందరికీ ఎంతో ప్రయోజనకరంగా మారుతుందని భరోసా ఇచ్చారు. ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ నాయకులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లపై భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

మొదటి పేజీ తరువాయి ..

# తెలంగాణ సంస్కృతిని ముందుకు తీసుకెళతాం

వేడుకలు ఢిల్లీలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, టీజీ బీజేపీ చీఫ్ రామచందర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నితిన్ నబీన్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, ప్రజల పోరాట స్ఫూర్తిని కొనియాడుతూ, అభివృద్ధి పథంలో రాష్ట్రం మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. చిన్న రాష్ట్రాల అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ లాంటి రాష్ట్రాలు ఏర్పాటు చేశాం. తెలంగాణ అభివృద్ధి కోసం రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు ఇచ్చాం. తెలంగాణ అమరవీరులకు నివాళు లర్పిస్తున్నా. అమరవీరుల కలలు కన్న రీతిలో ఇంకా రాష్ట్రం వెనుకబడి ఉంది. చిన్నమ్మ సుష్మా స్వరాజ్ తెలంగాణ ఏర్పాటుకు కృషి చేశారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వారు అధికారంలో ఉన్నారు. రాష్టా అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది. జార్ఖండ్ ఏర్పాటు సమయంలో జార్ఖండ్ ఏర్పాటు కానివ్వం అన్నవారే ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్నారు.

# భారత్‌లో ఎబోలా టెన్షన్..

పటిష్ట చర్యలు చేపట్టింది. కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, విమానాశ్రయాల్లో పటిష్టమైన స్క్రీనింగ్, నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దేశంలో ఇప్పటివరకు ఎబోలా (బుండిబుగ్యో స్ట్రెయిన్) కేసులు ఏవీ నమోదు కాలేదనీ, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ముందస్తు జాగ్రత్తగా అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు థర్మల్ స్క్రీనింగ్ తప్పనిసరి చేశారు.గత 21 రోజుల్లో ఎబోలా ప్రభావిత దేశాల నుంచి నేరుగా వచ్చిన వారు లేదా ఆ దేశాల మీదుగా ప్రయాణించి వచ్చిన వారు కచ్చితంగా స్వీయ నిర్బంధంలో ఉండాలని కేంద్ర ఆరోగ్య శాఖ గట్టిగా సూచించింది. ఒకవేళ ఆ ప్రయాణికులలో అకస్మాత్తుగా జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పి, వాంతులు, విరేచనాలు, లేదా శరీరంలో ఎక్కడినుంచైనా అకారణంగా రక్తస్రావం కావడం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే స్థానిక ఆరోగ్య అధికారులకు సమాచారం అందించాలి. సాయం కోసం వెంటనే కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ '1075' కు కాల్ చేయాలని విజ్ఞప్తి చేసింది. సకాలంలో వైద్య సహాయం పొందడం ద్వారా బాధితుల ప్రాణాలను కాపాడుకోవడమే కాకుండా, ఇతరులకు వ్యాధి సోకకుండా నిరోధించవచ్చని ది హిందూ రిపోర్ట్ చేసింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్రం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ పంపింది. ఆసుపత్రులలో ప్రత్యేక ఐసోలేషన్ వార్డులు, పరీక్షల కోసం ల్యాబొరేటరీలను ఎప్పుడూ సిద్ధంగా ఉంచాలని.. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ), నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు అందాయి. విమానాశ్రయంలో ఎవరైనా అనుమానిత రోగులు గుర్తిస్తే వెంటనే వారిని ప్రత్యేక అంబులెన్సుల ద్వారా ఐసోలేషన్ సెంటర్లకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

## తెలంగాణ మీడియా అకాడమిలో
# అవతరణ దినోత్సవం

- జాతీయ పతాకాన్ని మీడియా అకాడమి చైర్మన్

హైదరాబాద్,జూన్2(పద్మక్రాంతి):

మంగళవారం నాడు నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ప్రజల సుదీర్ఘ ఉద్యమానికి ఫలితమని
పేర్కొన్నారు. సాధించుకున్న తెలంగాణలో స్వేచ్ఛ, ఆత్మాభిమానం ముఖ్యం అన్నారు. మన రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ అందాలన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడం మన రాష్ట్ర ముఖ్యమంత్రి గొప్పదనం అన్నారు. అదే విధంగా పేద ప్రజలకు రేషన్ షాప్ ల ద్వారా సన్న బియ్యం అందిస్తున్నారని ప్రజా ప్రభుత్వం సేవలను ఆయన కొనియాడారు. అదే విధంగా మహిళా సాధికారిత కోసం మహిళలచే సూపర్ బజార్లు, పెట్రోల్ బంక్ ల నిర్వహణ, గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకుని మహిళాభివృద్ధికి ప్రభుత్వం తొడ్పాటు అందిస్తుందన్నారు. గ్రామీణ, పట్టాణాలలో పని చేస్తున్న కార్మికులకు సమాన వేతనాలను అందేలా చట్టం చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎందరో మహానుభావుల త్యాగం ఉన్నదన్నారు. ఈ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో జర్నలిస్టులు, కవులు, కళాకారులు, ఉద్యోగులు, విద్యార్థులు సబ్బండవర్ణాల ప్రజలు పాల్గొని రాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగిందన్నారు. అదే విధమైన స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ముందుగా జనగణమన గీతాలాపన, అనంతరం తెలంగాణ
రాష్ట్ర గేయం జయ జయహే తెలంగాణ గీతాన్ని ఆలపించడం జరిగింది. కార్యక్రమంలో మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి, సిబ్బంది శ్రీలతాదేవి, ప్రసాద్, నరేష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగాలు, దశాబ్దాల ప్రజాస్వామ్య పోరాటాలు

**ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం: గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా**

హైదరాబాద్,జూన్2(పద్మక్రాంతి):

అమరవీరుల త్యాగాలకు, దశాబ్దాల ప్రజాస్వామ్య పోరాటాలకు ప్రతీక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం లోక్‌భవన్‌లో గవర్నర్ జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఆయన ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ, ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న తెలంగాణ బిడ్డలందరికీ గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగించారు. ఆధునిక తెలంగాణ నిర్మాణానికి పునాదులు వేసిన ప్రతి ఒక్కరినీ ఈ సందర్భంగా స్మరించుకోవాలని గవర్నర్ పిలుపునిచ్చారు. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అనే సూక్తిని ప్రస్తావిస్తూ, జన్మభూమి స్వర్గం కంటే గొప్పదని పేర్కొన్నారు. తెలంగాణ శతాబ్దాల నాటి సంస్కృతి, సంప్రదాయాలు, గ్రామీణ వ్యవసాయ వారసత్వం రాష్ట్ర అసలైన జీవనాడిగా నిలిచాయని గవర్నర్ అన్నారు. కాకతీయుల కాలం నాటి గొలుసుకట్టు చెరువుల నుంచి నేటి ఆధునిక సాగునీటి ప్రాజెక్టుల వరకు రైతాంగం చేసిన కృషి తెలంగాణను సస్యశ్యామలం చేసిందని కొనియాడారు. వ్యవసాయ రంగంతో పాటు ఐటీ, ఫార్మా, స్టార్టప్ తదితర రంగాల్లో తెలంగాణ అంతర్జాతీయ గుర్తింపు సాధించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలు, 'సర్వే భవంతు సుఖినః' అనే ఆదర్శ స్ఫూర్తితో గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమం, నగరాల ఆధునీకీకరణ సమపాళ్లలో సాగుతూ సుసంపన్న తెలంగాణ నిర్మాణం జరగాలని గవర్నర్ ఆకాంక్షించారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి)
తెలుగు దినపత్రిక

# ఘనంగా అవతరణ వేడుక





పాపన్నపేట, జూన్ 2 (పద్మక్రాంతి)

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుక పాపన్నపేట మండల వ్యాప్తంగా ఘనంగా జరిగింది. మంగళవారం పాపన్నపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పావని నరేందర్ గౌడ్,మండల వనరుల కేంద్రం వద్ద ఎంఈఓ ప్రతాప రెడ్డి,మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో విష్ణువర్ధన్,వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏవో శ్రీనివాస రాజు,ఎమ్మార్వో కార్యాలయం వద్ద తహశీల్దార్ సతీష్ కుమార్ మువ్వన్నెల జెండా ఎగురావేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలాధ్యక్షుడు నరేందర్ గౌడ్,భారాస పార్టీ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ గురుమూర్తి గౌడ్ జాతీయ పతికావిష్కరణ చేసి రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గునిశెట్టి మల్లేశం,పాపన్నపేట,కొత్తపల్లి ఉప సర్పంచులు సద్దాం హుస్సేన్,వాంకిడి రాము,వివిధ పార్టీ నాయకులు..కుమ్మరి జగన్,ఉప్పరి వెంకటేశం,ఆకుల శ్రీనివాస్,గౌస్,దోసని సంగమేశ్వర్ తదితరులు ఉన్నారు.

## జీహెచ్ఎంసీ శంషాబాద్ జోనల్ కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు






పద్మక్రాంతి జూన్ 02, (రాజేంద్రనగర్ ప్రతినిధి):

జీహెచ్ఎంసీ శంషాబాద్ జోనల్ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శంషాబాద్ జోన్ జోనల్ కమిషనర్ కే. చంద్రకళ శంషాబాద్ సర్కిల్-18 డిప్యూటీ కమిషనర్ బి. సుమన్ రావు,మాజీ మున్సిపల్ చైర్మన్ కె. సుశ్మ మహేందర్ రెడ్డితో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జోనల్ కమీషనర్ ప్రసంగిస్తూ.... తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి సాధించిన ప్రగతిని గుర్తు చేసుకుంటూ, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.దేశభక్తి భావనల మధ్య నిర్వహించిన ఈ వేడుకలు విజయవంతంగా ముగిశాయి.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లి యువకుడు మృతి

హైదరాబాద్, జూన్ 2(పద్మక్రాంతి):



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో మంగళవారం విషాదం చోటుచేసుకుంది. ఈత సరదా ఓ యువకుడి ప్రాణం తీసింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. కరీంనగర్ పచ్చునూర్ గ్రామానికి చెందిన దాసారపు కార్తీక్ ఉపాధి నిమిత్తం హుస్నాబాద్‌కు వచ్చాడు. మంగళవారం తన స్నేహితులతో కలిసి పట్టణ శివార్లలోని ఎల్లమ్మ చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతంలోకి వెళ్లిన కార్తీక్ నీటిలో మునిగి చనిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

## తెలంగాణ ప్రశాంతంగా ఉండటం ఇష్టం లేదా పవన్

- తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

హైదరాబాద్, జూన్ 2(పద్మక్రాంతి):

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యక్రమం నిర్వహించాలన్న నిర్ణయంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్య ద్వారా తెలంగాణ, ఆంధ్ర ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారా? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలకు అత్యంత పవిత్రమైన రోజున సభ పెట్టడం ద్వారా పవన్ కల్యాణ్ ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని నిలదీశారు. తెలంగాణ ప్రశాంతంగా ఉండటం పవన్‌కు ఇష్టం లేదా అని ఆయన ప్రశ్నించారు. జనసేన తలపెట్టిన కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించిన విషయాన్ని కూడా ఆయన గుర్తుచేశారు.

# ఆలేరు ఎక్సైజ్ స్టేషన్‌లో 'నిద్రపోతున్న' వ్యవస్థ.







- తలుపులు మూసి అధికారుల విశ్రాంతి!
- తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజునే ఘటనపై ప్రజల ఆగ్రహం

సామల సిద్దులు - యాదాద్రి, జూన్ 2 ( పద్మక్రాంతి) :

ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు.. విధి నిర్వహణను గాలికొదిలేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని ప్రొహిబిషన్ ఎ ఎక్సైజ్ స్టేషన్ అధికారులు, సిబ్బంది తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయ పనివేళలు ముగియక ముందే, లోపల తలుపులు మూసుకుని నిద్రపోతుండటం ఇక్కడి నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలిచింది. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 రోజునే మధ్యాహ్నం సమయంలో వివిధ పనుల నిమిత్తం, ఫిర్యాదులు ఇవ్వడానికి వచ్చిన ప్రజలకు ఎక్సైజ్ స్టేషన్ ప్రధాన ద్వారం మూసివేశారు. ఆఫీస్ టైమ్ అవ్వకముందే తలుపులు క్లోజ్ చేశారని పరిశీలించగా.. అధికారులు, సిబ్బంది లోపల దర్జాగా నిద్రపోతున్న ఉదంతం వెలుగుచూసింది. మద్యం బెల్ట్ షాపుల నియంత్రణ, అక్రమ రవాణాపై నిరంతరం నిఘా ఉంచాల్సిన కీలకమైన ఎక్సైజ్ శాఖ కార్యాలయం.. ఇలా నియోజకవర్గ కేంద్రంలో పట్టపగలే 'నిద్రపోవడం'పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దూరం ప్రాంతాల నుండి వచ్చే బాధితులకు ఈ మూసి ఉన్న తలుపులు శాపంగా మారాయి. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, విధుల్లో నిర్లక్ష్యం వహించి, ఆఫీసులోనే నిద్రకు ఉపక్రమించిన సదరు సిబ్బందిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆలేరు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఈ విషయంపై వివరణ కొరకు ఆలేరు ఎక్సైజ్ సీఐ దీపికను ఫోన్ లో సంప్రదించగా వారు అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

## పోరాటాల పురిటిగడ్డపై మువ్వన్నెల మురిపెం..

# మున్సిపల్ ఆఫీస్‌లో ఆవిర్భావ వేడుక

- చైర్‌పర్సన్, కమిషనర్ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ అవతరణ దినోత్సవం
- అమరుల త్యాగాలను స్మరిస్తూ జాతీయ పతాకావిష్కరణ

పటాన్ చేరు, జూన్ 2, (పద్మక్రాంతి):

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇస్నాపూర్ మున్సిపాలిటీలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. దశాబ్ది కాలంలో సాధించిన ప్రగతిని చాటుతూ, అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతిపిత మహాత్మా గాంధీ, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. అనేక పోరాటాలు, అమరుల త్యాగాల ఫలితంగా సిద్ధించిన తెలంగాణ రాష్ట్రం నేడు అన్ని రంగాలలో దేశంలోనే అగ్రగామిగా దూసుకుపోతోందని అన్నారు. అదే స్ఫూర్తితో ఇస్నాపూర్ మున్సిపాలిటీని కూడా అన్ని విధాలా ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, స్థానిక కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జెండా ఆవిష్కరణ అనంతరం ఒకరికొకరు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.





# బోడుప్పల్లో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు







- అమరవీరులకు నివాళులర్పించిన కాంగ్రెస్ నేతలు

బోడుప్పల్, జూన్ 12 (పద్మక్రాంతి):

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణంలో, బోడు పల్సర్కిల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ ,మాజీ మేయర్లు అమర్ సింగ్, అజయ్ యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్లు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నరసింహారెడ్డి, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హరినాథ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మాజీ కో-ఆప్షన్ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బోడుప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆసర్ల బీరప్ప, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొని తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించి తెలంగాణ తల్లి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి ఆధ్వర్యంలో పలువురు డివిజన్ నాయకులు తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకొని తెలంగాణ తల్లి చిత్రపటానికి ఘటించారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి పద్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన అమరుల త్యాగాలను ప్రతినిత్యం స్మరించుకుంటూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చీరాల నరసింహ, కాంగ్రెస్ నాయకులు దానగళ్ళ యాదగిరి, డివిజన్ అధ్యక్షుడు పబ్బు సత్యనారాయణ,శ్రీనివాస్, మాణిక్యం, ప్రభు, మహిళా నాయకులు పూర్ణిమ ,శైలజ తదితరులు పాల్గొన్నారు.

# పీర్జాదిగూడలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు





- జాతీయ జెండా ఆవిష్కరించిన మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి
- అమరులకు నివాళులర్పించిన బిఆర్ఎస్ నేతలు

పీర్జాదిగూడ, జూన్ 02,(పద్మక్రాంతి):

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్లలో అమరవీరుల స్తూపం, తెలంగాణ తల్లి విగ్రహాల వద్ద పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన బీఆర్ఎస్ అధినేత తెలంగాణ తొలిముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) నాయకత్వాన్ని గుర్తు చేసుకుంటూ తెలంగాణ ఆవిర్భావం వెనుక ఉన్న ఉద్యమ చరిత్రను కొనియాడారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అనేది కోట్లాది ప్రజల కల, ఆ కలను సాకారం చేయడానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో జరిగిన ఉద్యమం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. తెలంగాణ అనేది ఒక రాష్ట్రం మాత్రమే కాదు, అది త్యాగాల ఫలితం, ఆత్మగౌరవానికి ప్రతీక, అమరవీరుల ఆశయాలు, కేసీఆర్ చూపిన దిశే తెలంగాణ భవిష్యత్తుకు మార్గదర్శకం. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన కేసీఆర్ చూపిన మార్గంలో రాష్ట్ర హక్కులు, ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం పోరాటం కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, కౌడే పోచయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, జావీద్ ఖాన్, యూత్ అధ్యక్షులు ప్రభు, ఆకుల మధుకర్, శ్యామల శ్రీనివాస్, జిలాని పాషా, కందుకూరి ఆంజనేయులు, బాలరాజు, కోనేటి వెంకట్, మునికుంట్ల కిరణ్ గౌడ్, బుల్లెట్ శంకర్, ప్రవీణ్ రెడ్డి, శ్రీరాములు గౌడ్, అయోధ్య యాదవ్, పాశం నరేందర్ రెడ్డి, శ్రీకాంత్, జోసెఫ్ రెడ్డి, శివరాజు, వారికల శ్రీనివాస్, రాయల అశోక్, సతీష్, శ్రీనివాస్ రెడ్డి, అశోక్ రెడ్డి, మల్లం వెంకటేష్ గౌడ్, వెంకట్, రామకృష్ణ, తిరుమలేష్,అమర్ పటేల్, ఆకుల సత్యనారాయణ, పుల్ల శ్రీనివాస్, మేడబోయిన విజయ్ యాదవ్, జమీల్, సుభాన్, కళ్యాణి, ఇందిరా, లావణ్య, సరస్వతి, సరిత, సావిత్రి, సంధ్య, పన్నాభాయ్, అక్కలశ్రీనివాస్, శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బుధవారం, జూన్ 3, 2026

RNI No : TELTEL/2022/85167

పద్మక్రాంతి (వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

ఘనంగా తెలంగాణ ఉద్యమకారుడు

## నత్తి మైసయ్య జన్మదిన వేడుకలు

- శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు, అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు





**బోడుప్పల్, జూన్ 02 (పద్మక్రాంతి):**

తెలంగాణ ఉద్యమకారుడు, అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నత్తి మైసయ్య జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బోడుప్పల్ బంగారు మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ బొబ్బల లక్ష్మారెడ్డి నత్తి మైసయ్యను ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు కాంగ్రెస్ నేతలు, అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు, బోడుప్పల్ భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు, నత్తి మైసయ్యను ఘనంగా సన్మానించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో,సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని, భవిష్యత్తులో రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు మరింత సేవ చేయాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దాన గళ్ళ యాదగిరి, బోడుప్పల్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు వెంకిర్యాల లక్ష్మీనరసయ్య, సంఘం నేతలు, కాంగ్రెస్ కార్యకర్తలు, అంబేద్కర్ ఆశయసాధన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 10 లోగా పాఠ్యపుస్తకాల పంపిణీ

# పూర్తి కావాలి

- జిల్లా విద్యాశాఖాధికారి బి. బిక్షపతి



**సామల సిద్దులు - యాదాద్రి, జూన్ 2 ( పద్మక్రాంతి) :**

పాఠశాలల పునఃప్రారంభాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి బి. బిక్షపతి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన భువనగిరి మండల కేంద్రంలోని దివ్య బాల పాఠశాలలో ఏర్పాటు చేసిన "టెక్స్ట్ బుక్స్" గోదామును ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గోదాములోని పాఠ్యపుస్తకాల నిల్వలను, వాటి నాణ్యతను ఆయన నిశితంగా పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదాద్రి - భువనగిరి జిల్లాలో జూన్ 3 బుధవారం నుండి జిల్లావ్యాప్తంగా ఉన్న పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం అధికారికంగా పంపిణీ ప్రారంభించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 10వ తారీఖు లోపు వంద శాతం పుస్తకాల పంపిణీ పూర్తి కావాలని నిర్దేశిత గడువులోగా పంపిణీ ప్రక్రియ సజావుగా సాగేలా చూడాల్సిన బాధ్యత స్థానిక ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులపై ఉందన్నారు, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదన్నారు.పాఠశాలలు తెరిచే నాటికే విద్యార్థుల చేతుల్లో పుస్తకాలు ఉండేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

బాలానగర్ ఇన్‌స్పెక్టర్ టి. నర్సింహా రాజుకు ప్రతిష్ఠాత్మక

## 'తెలంగాణ పోలీస్ సేవా పతకం'..

**పద్మక్రాంతి, జూన్ 02,(కూకట్పల్లి, ప్రతినిధి )**




తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వేళ పోలీస్ శాఖలో పండుగ వాతావరణం నెలకొంది. విధి నిర్వహణలో అసాధారణ ప్రతిభ, అంకితభావాన్ని కనబరిచిన పోలీస్ అధికారులను ప్రభుత్వం సేవా పతకాలతో గౌరవించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేటగిరీల్లో మొత్తం 631 మంది సిబ్బందిని ఈ పురస్కారాలకు ఎంపిక చేసింది. ఇందులో భాగంగా బాలానగర్ ఇన్‌స్పెక్టర్ టి. నర్సింహా రాజును ప్రతిష్ఠాత్మక 'తెలంగాణ పోలీస్ సేవా పతకం' వరించింది.

ఈ సందర్భంగా సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే సిబ్బందికి ప్రభుత్వం ఇచ్చే ఈ గుర్తింపు ఎంతో గర్వకారణం. బాధ్యతను మరింత పెంచింది. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా ఈ పతకాలను అందజేయనున్నారు. ఈ పురస్కారం రావడానికి సహకరించిన ఉన్నతాధికారులకు, తోటి సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు."

ఈ పురస్కారాలు పోలీస్ శాఖలో మరింత ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, ప్రజల కోసం మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు తోడ్పడతాయని సీఐ నర్సింహా రాజు ఆశాభావం వ్యక్తం చేశారు.

# మహనీయుల ఆశయాల కొరకే మల్లు రవి యాత్ర నిర్వహిస్తున్నారు.







- రాజ్యాంగ ఫలాలు అందరికీ అందే విధంగా చూడడమే జ్ఞాన చైతన్యాత్ర లక్ష్యం
- ప్రచార రథం ప్రారంభించిన అంతర్జాతీయ మానవ హక్కుల నాయకుడు పాల్ దివాకర్
- హాజరైన ఎమ్మెల్యేలు, పలువురు నాయకులు

**తలకొండపల్లి (కడ్తాల్) జూన్ 02, (పద్మక్రాంతి):**

దేశంలోని మహనీయుల ఆశయాల సాధన కొరకు నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు, తెలంగాణ ఎంపీల ఫోరం కన్వీనర్ డాక్టర్ మల్లురవి రథయాత్ర ప్రారంభించారని, పలువురు నాయకులు కొనియాడారు. గురువారం నాడు రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో మహనీయుల ఆశయ సాధన కొరకు నిర్వహిస్తున్న జ్ఞాన ప్రచార రథయాత్రబస్సును అంతర్జాతీయ మానవ హక్కుల నాయకుడు పాల్ దివాకర్, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కుచుకుల్ల రాజేష్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ ల చేతుల మీదుగా రథయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అంతర్జాతీయ హక్కుల నాయకుడు పాల్ దివాకర్ మాట్లాడుతూ.. ప్రపంచంలో హింస, వివక్షత లేని రాజ్యస్థాపన కొరకు మానవజాతి పని చేయవలసిన అవసరం ఉందని, ప్రతి ఒక్కరూ తమ హక్కులను సంపూర్ణంగా సద్వినియోపరుచుకునేందుకు ప్రజాస్వామ్యబద్ధంగా రాజ్యాలు అవకాశం కల్పించే విధంగా చూడాలన్నారు. అనంతరం నాగర్కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణులు మాట్లాడుతూ నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని అన్ని మండల కేంద్రాలు గ్రామాల్లో మహనీయుల పేరుతో రథయాత్ర నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ రథయాత్ర ద్వారా ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ఉపయోగపడుతుందని, ఒక నెల రోజులపాటు ఈ యాత్ర ఏర్పాటు చేయడం పార్లమెంటు సభ్యులు నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి ఎంతో చొరవతో కమిటీ ఏర్పాటు చేసి ప్రారంభిస్తున్నారని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాజేష్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ, అంతర్జాతీయ మానవ హక్కుల నాయకుడు పాల్ దివాకర్, ప్రచార రథ కోఆర్డినేటర్ జి సుధాకర్, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ బహదూర్ బీసీ కమిషన్ సభ్యులు నిరంజన్ కాంగ్రెస్ పార్టీ మహబూబ్నగర్ జిల్లా నాయకులు శివశంకర్, బేడ బుడగ జంగం రాష్ట్ర నాయకులు సహదేవ్, అశోక్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ పిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రాములు, ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నరసింహ, రమేష్ బహదూర్, బాలయ్య, తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి, దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా కార్యదర్శి జోగు రమేష్,, జర్నలిస్ట్ సంఘం నాయకులు దరువుల శంకర్, ఆమనగల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు డేవిడ్, సురేందర్ రెడ్డి, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు భూపతిరెడ్డి, సురేందర్, ప్రవీణ్, కురుమ సంఘం జిల్లా నాయకులు గొరిగే వెంకటయ్య, సానుగుల జంగయ్య బాలు, మిఠాయిపల్లి రమేష్ మీసాల రమేష్ తో పాటు ఆయా గ్రామాల కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి.





- టీడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా కమిటీ మంత్రి శ్రీధర్ బాబుకు, కలెక్టర్‌కు వినతి
- జర్నలిస్టుల ఇండ్ల జాగాల విషయంలో పాలసీ తయారు చేస్తున్నాం
- రంగారెడ్డి జిల్లా జర్నలిస్టులకు ప్రాధాన్యత ఉంటుంది
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

**రంగారెడ్డి, జూన్ 02, (పద్మక్రాంతి):**

హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీలో ఇండ్ల జాగాలు ఇవ్వాలన్న అంశంపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఆలోచన మంచి పరిణామని, అదే క్రమంలో ఈ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల వివరాలు కూడా సేకరించి ఫ్యూచర్ సిటీలో ఇండ్ల జాగాలు ఇవ్వాలని టీడబ్ల్యూజేఎఫ్ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శేరిబాయి గణేష్, మైల సైదులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు , రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డికి వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రికి పలు అంశాలు వివరించారు. స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం పాలసీ తయారు చేస్తోంది. ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇండ్ల జాగాలు ఇస్తే.. అందులో మొదట రంగారెడ్డి జిల్లా జర్నలిస్టులకు ఇచ్చిన తరువాత స్టేట్ వారికి ఇస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి శ్రీనివాస్ చారి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి. వెంకటేశ్, శ్రీనివాస్ , నర్సింహ్మ, రాజశేఖర్, సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు అంజి , యాదయ్య, కాంత్రి, శ్రీశైలం, జిల్లా ప్రచార కార్యదర్శి నర్సింహ్మారెడ్డి, సోషల్ మీడియా కమిటీ కన్వీనర్ శివ కుమార్ గౌడ్ , జిల్లా కమిటీ సభ్యులు శ్రీశైలం, అంజి, నియోజకవర్గాల అధ్యక్ష కార్యదర్శులు పి. జగన్, రాఘవేందర్ గౌడ్, నరేష్ , రాజు, జైచందర్, శంకర్, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# జెడ్పీహెచ్ఎస్ గట్టు ఇప్పలపల్లి విద్యార్థులకు అరుదైన గౌరవం





త్రిబుల్ ఐటీలో గీతాంజలి ఎంపిక,
గ్రామీణ ప్రగతి సొసైటీ స్కాలర్‌షిప్‌కు గీతాంజలి, అరుణ్ ఎంపిక.

**తలకొండపల్లి జూన్ 02,(పద్మక్రాంతి):**

తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. పాఠశాలకు చెందిన ప్రతిభావంతురాలు గీతాంజలి ప్రతిష్ఠాత్మకమైన త్రిబుల్ ఐటీ మహబూబ్‌నగర్లో ప్రవేశానికి ఎంపికై పాఠశాలకు, గ్రామానికి గర్వకారణంగా నిలిచింది.అదే విధంగా పాఠశాలకు చెందిన విద్యార్థులు గీతాంజలి మరియు అరుణ్లు గ్రామీణ ప్రగతి సొసైటీ అందించే ప్రతిష్ఠాత్మక స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు.ఈ స్కాలర్‌షిప్ ద్వారా వారికి ప్రతి సంవత్సరం రూ.1 లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందనుంది. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి ఈ స్కాలర్‌షిప్ ఎంతో ఉపయోగపడనుంది.విద్యార్థుల ఈ ఘన విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు శాలువాతో సన్మానించడం జరిగింది. తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని వారు పేర్కొన్నారు.గీతాంజలి, అరుణ్‌లు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు ఈ గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రేణు రెడ్డి అశోక్ నరసింహ మల్లేష్ హరికృష్ణ రాజు కృష్ణ అరుణ్ శ్రీను రాజు తదితరులు పాల్గొన్నారు.

# కవిత పార్సిల్ రాజకీయం

- మీకు ముఖ్యమంత్రి పదవి ఎందుకు కవిత?
- విగ్రహాలు కూల్చడానికి కుర్చీ కావాలా?
- ప్రాంతాల మధ్య విద్వేషాలు రగల్చడానికా?
- కవితకు బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి కౌంటర్



**అమరావతి, జూన్ 2(పద్మక్రాంతి):**

కవిత చేసిన ఈ వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. విగ్రహాలు కూల్చడానికి, ప్రాంతాల మధ్య విద్వేషాలు రగల్చడానికి మీకు ముఖ్యమంత్రి పదవి కావాలా కవిత గారు? అంటూ ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కావాలంటే మీకు 'జింఖానా గ్రౌండ్' అంత విశాలమైన హృదయం ఉండాలి; అంతే తప్ప చంచల్‌గూడ జైలు అంత చిన్న మనసు ఉండకూడదు అంటూ గతంలో ఆమె జైలుకు వెళ్లిన ఉదంతాన్ని గుర్తు చేస్తూ పరోక్షంగా సంచలన సెటైర్లు వేశారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండాలనుకునే వారు సమాజాన్ని జోడించేలా మాట్లాడాలి కానీ, ఇలా విగ్రహాలు పగులగొడతామంటూ విద్వేషాలు రెచ్చగొట్టడం తగదని హితవు పలికారు. ఇదే తరుణంలో హైదరాబాద్‌లో జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనసేన పార్టీ నిర్వహించ తలపెట్టిన తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ కు పోలీసులు అనుమతి నిరాకరించడంపై కూడా విష్ణువర్ధన్ రెడ్డి స్పందించారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయనే సాకుతో సభను అడ్డుకోవడం వెనుక కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ దురుద్దేశం స్పష్టంగా కనిపిస్తోందని ఆయన విమర్శించారు. ఒక పక్క విపక్షాలు సెంటిమెంట్‌ను వాడుకుంటుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేళ పాత గాయాలను రేపుతూ, విగ్రహాల కూల్చివేత రాజకీయాలకు పిలుపునివ్వడం ద్వారా కవిత సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారాలని చూశారు. కానీ, దానికి విష్ణువర్ధన్ రెడ్డి ఇచ్చిన చంచల్‌గూడ కౌంటర్ సోషల్ మీడియాలో మరింత చర్చకు కారణం అవుతోంది. అంతకుముందు తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రాంతీయ విభేదాల మంటలు రాజుకుంటున్నాయి. ఇటీవల కల్వకుంట్ల కవిత స్థాపించిన తెలంగాణ రక్షణ సేన నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ నేతలను ఉద్దేశించి ఆమె చేసిన తీవ్ర వ్యాఖ్యలు ఇప్పుడు రెండు రాష్ట్రాల మధ్య పొలిటికల్ హీట్‌ను పెంచాయి. దీనిపై భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత విష్ణువర్ధన్ రెడ్డి గట్టిగా కౌంటర్ ఇవ్వడంతో ఈ వివాదం సరికొత్త మలుపు తిరిగింది. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హైదరాబాద్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఏపీ నేతలను, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని సంచలన వ్యాఖ్యలు చేశారు. మేము అధికారంలోకి రాగానే ఇక్కడున్న ఆంధ్రా నాయకుల విగ్రహాలను పగలగొట్టి, వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న విజయవాడకు పార్సిల్ చేస్తాం అంటూ ఆమె తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ పెట్టాలనుకోవడంపై మండిపడుతూ.. ఏపీ నేతలు ఇక్కడికి వచ్చి పెత్తనం చేయాలని చూస్తే పళ్లు రాలగొడతామంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

# జనసేనకు భారీ షాక్..

- హౌస్ మోషన్ పిటిషన్ తిరస్కరణ

హైదరాబాద్, జూన్ 2(పద్మక్రాంతి):

హైదరాబాద్‌లో ఇవాళ సభ పెట్టాలనుకున్న జనసేనకు హైకోర్టులో షాక్ తగిలింది. హైకోర్టులో వేసిన హౌస్ మోషన్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఇవాళ మధ్యాహ్నం బహిరంగ సభ పెట్టాలని జనసేన అనుకుంది. ఇందుకు ఉదయం పిటిషన్ వేసింది. ఐతే.. హైకోర్టు.. పిటిషన్‌పై విచారణకు టైమ్ లేదనీ.. ఇంత సడెన్‌గా విచారణ అంటే కష్టమని అభిప్రాయపడింది. పోలీసుల అభ్యంతరాలను తెలుసుకున్న హైకోర్టు.. పిటిషన్‌ని కొట్టివేసింది. ఐతే.. సాయంత్రం పవన్ కళ్యాణ్ జూబ్లీహిల్స్ లోని తన ఇంట్లో పెట్టే ప్రెస్ మీట్‌కి మాత్రం అనుకూల పరిస్ి?తులు ఉన్నాయి. కాబట్టి.. సభకు సంబంధించి జనసేన నెక్ట్స్ మరో తేదీ ఏదైనా నిర్ణయించుకునే ఛాన్స్ ఉంటుంది. హైదరాబాద్‌లో ఇవాళ తెలంగాణ నవ నిర్మాణ సేన పేరుతో సభ పెట్టుకోవాలని జనసేన పార్టీ అనుకుంది. ఐతే.. భద్రతా కారణాలు, ట్రాఫిక్ ఇతరత్రా కారణాలతో పోలీసులు ఈ సభకు అనుమతించలేదు. ఇదే విషయాల్ని హైకోర్టుకు కూడా చెప్పారు. చివరకు హైకోర్టు పోలీసుల వాదనకే మొగ్గు చూపింది. అందువల్ల జనసేన పిటిషన్‌పై విచారణ జరగకుండానే.. దాన్ని కొట్టేసినట్లైంది. ఇది జనసేనకు ఒక ఎదురుదెబ్బ లాంటిదే కాబట్టి.. ఇవాళ సాయంత్రం పవన్ కళ్యాణ్ ఎలా స్పందిస్తారు? ప్రెస్‌మీట్‌లో ఏం చెబుతారనేది ఆసక్తిగా మారింది.

# నకిలీ ల్యాండ్ జీవోల సృష్టికర్త

**పరారీలో వైసిపి మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానాయుడు**

హైదరాబాద్,జూన్ 2 (పద్మక్రాంతి):

గండిపేట వందల కోట్ల రూపాయల ల్యాండ్ నకిలీ జీవోల కేసులో సైబరాబాద్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానాయుడు పరారీ అయ్యారని పోలీసులు తెలిపారు. ఏపీలోని నరసరావుపేటలో బ్రహ్మానాయుడు ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానాయుడు అండ్ గ్యాంగ్ కేరళ, కర్ణాటకలో చక్కర్లు కొడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వీరి కోసం గాలిస్తున్నారు.

అక్రమ జీవోలను సృష్టించి రూ.వందల కోట్ల విలువైన ల్యాండ్‌ను కాజేసే కుట్రలో మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానాయుడు కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు గుర్తించారు. భూ కబ్జా చేసిన బ్రహ్మానాయుడు అండ్ గ్యాంగ్ వెంటనే భూమిని విక్రయించేందుకు ప్రయత్నాలు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. సోషల్ మీడియాలో ఈ నకిలీ జీవోలను బ్రహ్మానాయుడు అండ్ గ్యాంగ్ వైరల్ చేశారని పోలీసులు తెలిపారు. సోషల్ మీడియాలో నకిలీ జీవోలు వైరల్ కావడంతో సైబర్ క్రైమ్ పోలీసులు.. బ్రహ్మానాయుడు అండ్ గ్యాంగ్‌పై నిఘా పెట్టారు. వైసీపీ నేతలు బ్రహ్మానాయుడు, రాధాకృష్ణ ఇద్దరూ కలిపి మరికొన్ని జీవోలు సృష్టించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో పదిమంది నిందితుల్లో ఐదుగురిని అరెస్ట్ చేశామని, మరో ఐదుగురి కోసం గాలిస్తున్నామని పోలీసులు చెప్పారు. ఫేక్ జీవో కేసులో కడప జిల్లాకు చెందిన మరో వైసీపీ నేత ప్రమేయం కూడా ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఈ కేసులో కీలక నిందితుడు రాధాకృష్ణపైన ఇప్పటికే 9 కేసులు ఉన్నట్లు గుర్తించారు. అరెస్ట్ అయిన నిందితులను కస్టడీకి తీసుకొని విచారిస్తామని పోలీసులు పేర్కొన్నారు.

# అదుపుతప్పి బోల్తాపడ్డ కారు

- ఇద్దరు వ్యక్తుల దుర్మరణం

నాగర్ కర్నూల్, జూన్ 2(పద్మక్రాంతి):




జిల్లాలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. వంగూరు గ్రామానికి చెందిన బాలు, ప్రవీణ్ మరో వ్యక్తి కారులో జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై వెళుతున్నారు. కల్వకుర్తి మండలం తాండ్ర గేటు సమీపంలో కారు ప్రమాదానికి గురైంది. అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో బాలు, ప్రవీణ్ ప్రాణాలు కోల్పోయారు.

మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డ వ్యక్తిని దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డ వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులు బాలు, ప్రవీణ్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# నాలుగు కోట్ల ప్రజల జాగీరు తెలంగాణ

- నీ అయ్య జాగీర్ కాదు మిస్టర్ పవన్
- తెలంగాణపై అక్కసు వెళ్లగక్కడమే తెలుసు
- పవన్ మీడియా వ్యాఖ్యలపై మండిపడ్డ పొన్నం

హైదరాబాద్,జూన్2(పద్మక్రాంతి):



ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల జాగీరు.. నీ అయ్యా జాగీరు కాదంటూ జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్‌లో జనసేనాని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ గాంధీభవన్ వేదికగా స్పందించారు. మిస్టర్ పవన్ కళ్యాణ్.. ఇది మా అయ్య జాగీరే అని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. పవన్ కల్యాణ్ ఇక్కడికి వచ్చి పీకేదేంటని ఆయన ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ పెయిడ్ ఆర్టిస్ట్ అని అభివర్ణించారు. తన దగ్గర డబ్బులు ఉంటే తాను కూడా పవన్‌తో ఒక క్యారెక్టర్ చేయిస్తానన్నారు. తెలంగాణపై పవన్ కళ్యాణ్ మరోసారి అక్కసు వెళ్లగక్కారంటూ మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వ్యక్తి పవన్ అని తెలిపారు. గద్దర్‌కు కారు కొనిచ్చా అని చెప్పినందుకు ముందు క్షమాపణ చెప్పాలంటూ పవన్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. చనిపోయిన వారి గురించి మాట్లాడాల్సిన అవసరం ఏంటని ఏపీ డిప్యూటీ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. తనకి ఆంధ్రాలోనే దిక్కు లేదని పవన్ చెప్పుకున్నాడని వ్యంగ్యంగా అన్నారు. ఉద్యమ సమయంలో కూడా ఆంధ్రా వాళ్ళని మేం ఏం అనలేదని పేర్కొన్నారు. మేం ఆంధ్రా వాళ్ళని ఏదో అన్నట్టు పవన్ కళ్యాణ్ అబద్దాలు చెబుతున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటులో ఏ బిల్లు చేసినా తలుపులు మూసే పాస్ చేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పుకొచ్చారు. కొండగట్టుకు ఇచ్చిన పైసలు మీ అయ్యా జాగీరా? అని సందేహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు మీటింగ్ పెట్టడం గెలకడం కాదా? అంటూ అసహనం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ తిరిగితే జనాలు వస్తారు కానీ ఓట్లు వేయరని ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్ వచ్చినా, పోయినా మాకేం సంబంధం లేదన్నారు. తెలంగాణ ఎప్పుడైనా ఏపీ ప్రజలను స్వాగతిస్తూనే ఉంటుందని చెప్పారు. సినిమా నటుడిగా పవన్ ఎక్కడ తిరిగినా తమకేం ఇబ్బంది లేదన్నారు. పవన్ చేసిన వ్యాఖ్యలకు టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు ద్వంద్వ వైఖరిని అద్దం పడుతున్నాయని విమర్శలు గుప్పించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌వేదికగా పోస్ట్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పవన్ కల్యాణ్‌ది 'జనసేన' పార్టీ అని.. తెలంగాణలో బీజేపీ 'భజన సేన' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తెలంగాణలో నిరుద్యోగంపై కొట్లాడుతానని అన్న పవన్ కల్యాణ్‌కి.. కేంద్ర ప్రభుత్వం కారణంగా పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, పేపర్ లీక్ ఘటనలు కనిపించడం లేదా? అని నిలదీశారు. ఒకవేళ కనిపించినా నిలబడి కొట్లాడటానికి కాళ్ళు లేవట్లేవా?? అంటూ ఘాటుగా స్పందించారు. పవన్ ద్వంద్వ వైఖరికి ఎందుకని ప్రశ్నించారు. 'ఇది తెలంగాణ జాతి.. అమ్మలా ఆదరించడం తెలుసు.. తెలంగాణలో కుట్రలు చేస్తే అమ్మోరులా దహించడమూ తెలుసు' అంటూ పవన్‌ను హెచ్చరిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# తెలంగాణను అప్పుల పాలు చేసిన బిఆర్ఎస్

- కమీషన్ల కోసమే కాళేశ్వరం నిర్మాణం
- ఆవిర్భావ వేడుకల్లో మంత్రి వివేక విమర్శలు

మెదక్,జూన్2(పద్మక్రాంతి):

జిల్లాలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్న శంకరంపేట్ లో తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట్ స్వామి అమర వీరుల స్తూపం దగ్గర నివాళులర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు అమరవీరుల గుర్తు చేసుకుంటూ ప్రదదర్శించిన కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్టాన్ని బీఆర్ ఎస్ పదేళ్ల బీఆర్ ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు జేశారని అన్నారు. కమిషన్ల కోసమే లక్ష కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని విమర్శించారు. మరోవైపు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆవిర్భావ దినోత్సవం సంబురాలు ఘనంగా జరిగాయి. సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ లో జరిగిన ఆవిర్భావ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి జెండావిష్కరించి వేడుకలను ప్రారంభించారు. అంతకు ముందు గన్ పార్కు దగ్గర అమర వీరుల స్తూపానికి నివాళులర్పించారు సీఎం రేవంత్ రెడ్డి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మం జిల్లాలో జరిగిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో? మంత్రులు, అధికారులు, ప్రజలు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు.తెలంగాణ అమరవీరులను స్మరించుకుంటూ ఆటాపాటలతో సంబురాలను జరుపుకున్నారు.

# తెలంగాణ అస్తిత్వంపై మరోమారు దాడి

- పార్టీల పేరుతో ఆంధ్రా పాలకుల కుట్రలు
- మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి

మెదక్,జూన్2(పద్మక్రాంతి):

తెలంగాణ అస్తితత్వంపై దాడి చేసేందుకు ఆంధ్ర పాలకులు పార్టీల పేరుతో కుట్ర చేస్తున్నారని మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం మెదక్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ చేసి అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆంధ్ర పాలకులు పార్టీల పేరుతో తెలంగాణ వనరులు దోపిడీ చేసేందుకు కుట్రలు చేస్తున్నారని, కుట్రదారులకు తెలంగాణ పాలకులు మద్దతు పలుకుతున్నారని తెలిపారు. తెలంగాణ వ్యతిరేకులు అంతా ఒక్కటై మరోసారి రాష్ట్ర వనరులు దోపిడీ చేసేందుకు ప్రయత్నం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర రావు ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం 14 సంవత్సరాలు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న తెలంగాణను కాపాడేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి , మాజీ మున్సిపల్ చైర్మన్ బట్టి జగపతి,, పట్టణ పార్టీ కన్వీనర్ ఆంజనేయులు గౌడ్, నాయకులు లావణ్య రెడ్డి, సుభద్ర రావు తదితరులు పాల్గొన్నారు.


# ఉపాధికి వెళ్లిన మహిళపై అడవిపంది దాడి

మెదక్,జూన్2(పద్మక్రాంతి):

మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కూకట్లపల్లి గ్రామంలో మంగళవారం ఉదయం ఉపాధి హామీ పనులకు వెళ్లిన ఓ మహిళపై అడవి పంది దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. గ్రామానికి చెందిన చింతల అంజమ్మ తోటి కూలీలతో కలిసి ఉపాధి హామీ పనుల నిమిత్తం అడవిలోకి వెళ్లగా, అకస్మాత్తుగా ఎదురైన అడవి పంది ఆమెపై దాడి చేసింది. ఈ ఘటనలో అంజమ్మ రెండు చేతులు, కుడి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. దాడిని గమనించిన తోటి కూలీలు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం కౌడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వైద్య చికిత్స అందిస్తున్నారు.

# 91 మంది ఖైదీలకు ప్రభుత్వం క్షమాభిక్ష

**వారి ఉపాధికి తోడ్పాటు అందిస్తామన్న జైళ్లశాఖ డిజి**




హైదరాబాద్,జూన్2(పద్మక్రాంతి):

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం 91 మంది ఖైదీలకు క్షమాభిక్ష మంజూరు చేసింది. దీంతో ప్రకటించిన ఖైదీలు జైళ్ల నుంచి విడుదల కానున్నారు. ఈ విషయాన్ని తెలంగాణ జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా వెల్లడించారు. విడుదలవుతున్న ఖైదీలు సమాజంలో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని, మళ్లీ జైలు బాట పట్టకుండా బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆమె సూచించారు. విడుదల అవుతున్న వారిలో 85 మంది పురుషులు, ఆరుగురు మహిళలు ఉన్నారు. వీరిలో 38 మంది జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకుల్లో పనిచేయడానికి ఆసక్తి చూపినట్లు డీజీ తెలిపారు. వారికి వెంటనే నియామక పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. మిగిలిన 53 మంది వ్యవసాయం, స్వయం ఉపాధి రంగాల్లో స్థిరపడాలని నిర్ణయించుకున్నారని, వారికి కూడా అవసరమైన సహకారం అందిస్తామని వెల్లడించారు. అలాగే విడుదల అవుతున్న మహిళా ఖైదీల్లో నలుగురికి కుట్టు మిషన్లు అందజేసి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. విడుదల అవుతున్న వారు బాధ్యతాయుతంగా జీవించి సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకుంటే.. జైళ్ల శాఖ చేసిన కృషి ఫలించినట్లవుతుందని సౌమ్యా మిశ్రా పేర్కొన్నారు. గత ఏడాది కొత్త ప్రభుత్వం 213 మంది ఖైదీల విడుదలకు అనుమతి ఇవ్వగా, ఈసారి మరో 91 మందికి క్షమాభిక్ష మంజూరు చేసినట్లు ఆమె తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ప్రత్యేక జీవో జారీ చేసిన ప్రభుత్వం, అర్హులైన ఖైదీలకు ఏడాదిలో మూడు సార్లు క్షమాభిక్ష ఆధారంగా విడుదల అవకాశాలు కల్పించే విధానాన్ని అమలు చేస్తోందని వెల్లడించారు.

# తెలంగాణ ఉద్యమ కారుల గుర్తింపు

- ఈనెల 4 న అఖిలపక్ష సమావేశం

హైదరాబాద్,జూన్2(పద్మక్రాంతి):

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, వారిని సముచిత రీతిలో గౌరవించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఈనెల 4వ తేదీన అన్ని పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. డా.బీ.ఆర్.అంబెద్కర్ రాష్ట్ర సచివాలయంలో 6వ అంతస్తులోని రూమ్ నెంబర్ 33 లో 4 వ తేదీ ఉదయం 11.30 గంటలకు ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరై తమ విలువైన సలహాలు, అభిప్రాయాలు తెలిపేందుకు ఒక్కో పార్టీ నుండి ఇద్దరు ప్రతినిధులను నామినేట్ చేయాలని ప్రభుత్వం వివిధ రాజకీయ పార్టీలను కోరింది. ఈ పార్టీల ప్రతినిధులు 4వ తేదీ సమావేశానికి హాజరయ్యేందుకు సచివాలయంలోకి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ప్రవేశించేందుకు వీలుగా ముందస్తుగా తెలంగాణ రాష్ట్ర సచివాలయ చీఫ్ సెక్యూరిటీ అధికారి దేవీదాస్ (87126 66004 ) ను సంప్రదించాలని ఒక అధికారిక ప్రకటనలో తెలిపారు.

# పవన్ కల్యాణ్ ఖబడ్దార్.. తాట తీస్తా

- ఎమ్మెల్యే మందుల సామేల్

హైదరాబాద్, జూన్ 2(పద్మక్రాంతి):

తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ఆంధ్రా నేతల పెత్తనమేంటి? ఇంకా మీరు పెత్తనం చలాయించాలని చూస్తే మేం చేతగాని వాళ్లమా?' అని ఆయన పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. పవన్ కల్యాణ్‌ను 'ఖబడ్దార్.. తాట తీస్తా' అంటూ మండిపడ్డారు. 'దోచుకోని దాచుకున్నది సరిపోలేదా?' అంటూ మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.

# కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే స్వేచ్ఛ

- ఎమ్మెల్సీ కోదండరాం కీలక వ్యాక్యాలు
- పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

హైదరాబాద్, జూన్ 2(పద్మక్రాంతి):



తెలంగాణ జన సమితి కార్యాలయంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు జరిగాయి. ఎమ్మెల్సీ కోదండరాం రాష్ట్ర ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. '60 ఏళ్ల నిరీక్షణ ఫలించిన రోజు జూన్ 2, మేం ఎప్పుడూ ఆంధ్ర ప్రజలకు వ్యతిరేకం కాదు. తెలంగాణపై ఆంధ్ర పాలకుల పెత్తనాన్ని మాత్రమే వ్యతిరేకించాం' అని కోదండరాం మాట్లాడారు. సోనియాగాంధీ, సుష్మాస్వరాజ్ తెలంగాణ కోసం కృషి చేశారని, బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంకుశ వైఖరితో వ్యవహరించిందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్వేచ్ఛ వచ్చిందని కోదండరాం తెలిపారు. మరోవైపు హైదరాబాద్ లోక్‌భవన్‌లో రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా జరిగాయి. లోక్‌భవన్‌లో గవర్నర్ జాతీయ పతాకావిష్కరణ చేశారు. తెలంగాణ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని, వివిధ రాష్ట్రాల సమ్మిళిత సంస్కృతికి హైదరాబాద్ ప్రతీక అని గుర్తు చేసుకున్నారు. వసుధైక కుటుంబం భావనకు హైదరాబాద్ సాక్ష్యమన్నారు. వికసిత్ భారత్‌లో తెలంగాణ మరింత కీలకంగా ఎదుగుతుందని కొనియాడారు.

# అకాల వర్షాలతో రైతులు కన్నీరు

- తడిసి ముద్దవుతున్న వరి ధాన్యం
- ధాన్యం కుప్పల చుట్టూ వర్షపు నీరు



హైదరాబాద్, జూన్ 2(పద్మక్రాంతి): ఆరుగాలం కష్టపడి పండించిన పసిడిపంట చేతికొచ్చే సమయానికి అన్నదాతను ప్రకృతి పగబట్టి ఆడుకుంటోంది. ఉదయం పూట భగభగ మండుతున్న ఎండలు కమ్మేస్తుంటే.. రాత్రి కాగానే విరుచుకుపడుతున్న కారుమబ్బులు, భయపెడుతున్న ఈదురుగాలులు, అకాల వర్షాలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాతావరణం పూర్తిగా అతలాకుతలమైంది. పగలు దంచికొడుతున్న ఎండల తీరు ఒకలా ఉంటే రాత్రివేళ ముంచుకొస్తున్న అకాల వర్షాలు రైతన్నల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రకృతి కన్నెర్ర చేయడంతో స్వేదం చిందించి పండించిన ధాన్యం రాశులు కళ్ల ముందే తడిసిపోతుంటే ఆ దృశ్యాలు చూసి కర్షకులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ విభిన్న వాతావరణ పరిస్థితులు జిల్లావ్యాప్తంగా రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి.

కల్లాల్లో, వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ధాన్యం విక్రయించడానికి వచ్చిన కర్షకులు చెప్పనలవికాని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ కొనుగోలు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో పగలు రాత్రి కష్టపడి సాధించిన దిగుబడులను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. రోజుల తరబడి మార్కెట్ యార్డుల్లోనే పడిగాపులు కాస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. కల్లాల వద్ద, రోడ్ల పక్కన కుప్పలు పోసిన ధాన్యం వర్షానికి తడవకుండా ప్లాస్టిక్ కవర్లు కప్పుతూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడుపుతున్నారు. రోడ్లపైనే వరి కుప్పలు భారీగా పేరుకుపోవడంతో అటు వాహనదారులకు సైతం ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు.

గత రెండు మూడు రోజులుగా విరామం లేకుండా కురుస్తున్న అకాల వర్షాలకు జిల్లాలోని సాత్నాల, బేలా, జైనథ్, భోరజ్ మండలాల్లో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మార్కెట్ కేంద్రాల వద్ద ఆరుబయట నిల్వ ఉంచిన ధాన్యం కుప్పల చుట్టూ వర్షపు నీరు వాగుల్లా ప్రవహించడంతో వడ్లు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. ముఖ్యంగా తాంసి మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్ ఆరబోసిన జొన్న పంటతో, నిస్సహాయ స్థితిలో ఉన్న రైతులతో కిటకిటలాడుతోంది. కంటికి రెప్పలా కాపాడుకున్న జొన్న కుప్పలు అడపాదడపా కురుస్తున్న వానలకు తడిసిపోతుండటంతో వాటిని పదేపదే ఎండబెట్టుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమిస్తూ అలిసిపోతున్నారు. కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగడానికి ప్రధానంగా గన్నీ బ్యాగులు, లారీలు, హమాలీల కొరత కారణమని స్పష్టమవుతోంది. నిండిన బస్తాలను తరలించేందుకు లారీలు సకాలంలో రాకపోవడం, తూకాలు వేసేందుకు తగినంత మంది కూలీలు దొరకకపోవడంతో కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం పదిహేను ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు.. ఇప్పటి వరకు సుమారు రెండు లక్షల క్వింటాళ్ల వరిని మాత్రమే కొనుగోలు చేయగలిగారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఏమాత్రం పరిష్కారం కాకపోవడంతో వారం రోజులు గడిచినా రైతుల నిరీక్షణ యథాతథంగా కొనసాగుతూనే ఉంది. బస్తాల కొరత అన్నదాతల పాలిట పెను శాపంగా మారింది. క్షణం క్షణం మారుతున్న వాతావరణ పరిస్థితులు, అధికారుల నిర్లక్ష్యం వెరసి రైతుల సహనాన్ని తీవ్రంగా పరీక్షిస్తున్నాయి. పగలు ఎండకు ఎండుతూ, రాత్రి వానకు తడుస్తూ దిక్కుతోచని స్థితిలో ఉన్న కర్షకులు చివరికి తమ ఆగ్రహాన్ని ప్రదర్శిస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని డిమాండ్ చేస్తూ పలుచోట్ల రోడ్డెక్కి ధర్నాలు, ఆందోళనలు చేపట్టారు. వాన ఎప్పుడు ముంచుకొస్తుందో, గాలి దుమారం ఎప్పుడు కమ్ముకొస్తుందో తెలియని అయోమయ పరిస్థితుల్లో అధికారులు తక్షణమే స్పందించాలని వారు వేడుకుంటున్నారు. లారీలు, గోనెసంచులు తగినన్ని అందుబాటులో ఉంచి, నిబంధనలు సడలించి తడిసిన పంటను సైతం వెంటనే కొనుగోలు చేసి తమను తక్షణమే ఆదుకోవాలని రైతన్నలు ముక్తకంఠంతో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

RNI No : TELTEL/2022/85167

పద్మక్రాంతి

(వాస్తవాలు వెలుగులోకి)

తెలుగు దినపత్రిక

## కారుణ్య నియామకాలకు కుమార్తెలూ అర్హులే

- సంచలన తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ,జూన్2(పద్మక్రాంతి):

కారుణ్య నియామకాలకు వివాహిత కుమార్తెలు కూడా అర్హులేనని సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. వివాహిత కుమార్తెను కుటుంబం నిర్వచనం నుంచి మినహాయించడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. అలహాబాద్ హైకోర్టు తీర్పును కొట్టివేస్తూ, బాంబే హైకోర్టు తీర్పుతో ఏకీభవించింది. వివాహం కారణంగా అర్హత ఉన్న కూతురికి సామాజిక సంక్షేమ ప్రయోజనాలు లేకుండా చేయడం సరికాదని ధర్మాసనం అభిప్రాయపడింది. యూపీకి చెందిన ఒక వివాహిత మహిళ తన తల్లి మరణం తర్వాత రేషన్ షాప్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేయగా, 'వివాహిత కూతురు' అనే కారణంతో నిరాకరించారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు యూపీ అధికారులను నాలుగు వారాల్లో లైసెన్స్ ఇవ్వాలని ఆదేశించింది.

## తెలంగాణ ప్రజలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు: వైఎస్ జగన్

అమరావతి, జూన్ 2(పద్మక్రాంతి):

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా తెలంగాణ సోదర సోదరీమణులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు అంటూ ఎక్స్(ట్విట్టర్)లో పోస్ట్ పెట్టారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న సమయంలో, రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా వైఎస్ జగన్ తెలంగాణ ప్రజలతో, ఇక్కడి ప్రభుత్వాలతో సోదరభావంతోనే వ్యవహరిస్తూ వచ్చారు. ఇప్పుడు కూడా అదే పద్ధతిలో తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

## తెలంగాణ నిరుద్యోగులకు శుభవార్త

- ఆర్ అండ్ బిలో 222 ఖాళీ ఇంజనీర్ల భర్తీ
- నోటిఫికేషన్ ఇచ్చిన టిజి పబ్లిక్ సర్వీస్ కమిషన్

హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మరో కీలక నోటిఫికేషన్ విడుదల చేసింది. ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యార్హత కలిగిన అభ్యర్థులకు ఇది మంచి అవకాశంగా మారనుంది. రోడ్లు, భవనాల శాఖలో మొత్తం 222 ఖాళీల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నోటిఫికేషన్‌లో భాగంగా 49 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టులు, 19 ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి జూన్ 18 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఎఇఇ పోస్టులకు జూలై 13 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండగా, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టులకు జూలై 15 వరకు గడువు కల్పించారు. అభ్యర్థులు అధికారిక నోటిఫికేషన్‌లో పేర్కొన్న అర్హతలు, వయోపరిమితి, ఇతర నిబంధనలను పరిశీలించి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. నియామక ప్రక్రియలో భాగంగా రాత పరీక్షలను ఆగస్టు 10 నుంచి 17 వరకు నిర్వహించనున్నారు. పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన అభ్యర్థులను తుది ఎంపికకు పరిగణలోకి తీసుకుంటారు. పూర్తి వివరాల కోసం అభ్యర్థులు కమిషన్ అధికారిక నోటిఫికేషన్‌ను పరిశీలించాలని సూచిస్తున్నారు.


## మహిళను మాటల్లో పెట్టి గొలుసు చోరీ

హైదరాబాద్,జూన్2(పద్మక్రాంతి):

నగరంలో చైన్ స్నాచర్ రెచ్చిపోయాడు. కూరగాయాల కోసం బయటకు వెళ్లిన మహిళతో ఓ వ్యక్తి మాటలు కలిపి అకస్మాత్తుగా ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడు. అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగి ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. రత్నమాల అనే మహిళ కూరగాయలు కొనుగోలు చేసి ఇంటికి తిరిగి వెళ్తోంది. దుర్గాబాయి దేశ్ముఖ్ కాలనీలోని వేదశ్రీ అపార్ట్‌మెంట్‌లో తన నివాసంలోకి అడుగు పెట్టగానే ఓ గుర్తు తెలియని వ్యక్తి కాలినడకన ఆమె వద్దకు వచ్చాడు. మహిళతో కాసేపు మాట్లాడిన నిందితుడు.. ఒక్కసారిగా ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని అక్కడి నుంచి పరారయ్యాడు. దుండగుడి చర్యతో మహిళ షాక్‌కు గురైంది. దొంగలించిన గొలుసు సుమారు రెండున్నర తులాలు ఉంటుందని అంచనా. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటన జరిగిన సమయంలో నిందితుడు హెల్మెట్ ధరించి ఉన్నట్లు తెలుస్తోంది. దుండగుడి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.

## భవిష్యత్ అంతా డిజిటల్ ఎకానమీదే

- ఆంధ్రప్రదేశ్ కీలక గమ్యస్థానంగా ఎదుగుతోంది
- ఎయిర్‌ట్రంక్ వ్యవస్థాపకుడు రాబిన్ ఖుదాతో చంద్రబాబు భేటీ



అమరావతి,జూన్2(పద్మక్రాంతి):

భవిష్యత్తు డిజిటల్ ఎకానమీకి ఆంధ్రప్రదేశ్ కీలక గమ్యస్థానంగా ఎదుగుతోందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశ్వాసం వ్యక్తం చేశారు. డిజిటల్ హబ్‌గా విశాఖపట్నం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. మంగళవారం రాజధాని అమరావతిలో ఆసియా-పసిఫిక్‌లో ప్రముఖ హైపర్‌స్కేల్ డిజిటల్ ఇన్‌ఫ్రా సంస్థ ఎయిర్‌ట్రంక్ వ్యవస్థాపకుడు రాబిన్ ఖుదాతో సమావేశమైనట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఛూజ్ ఎపి నినాదంతో పెట్టుబడుల ఆకర్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆయనకు వివరించినట్లు తెలిపారు. విశాఖపట్నంలో 2 గిగావాట్ల హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటుపై రాబిన్ ఖుదాతో సంప్రదింపులు జరిపినట్లు సీఎం చంద్రబాబు చెపా-ఽరు. ఏఐ, క్లౌడ్, నెక్ట్స్ జనరేషన్ టెక్నాలజీలకు విశాఖ కేంద్రంగా మారనుందన్నారు. ప్రపంచ స్థాయి డిజిటల్ ఎకోసిస్టమ్ నిర్మాణమే లక్ష్యమని సీఎం చంద్రబాబు వివరించారు. క్లీన్ ఎనర్జీ, కనెక్టివిటీ, నైపుణ్య యువతతో ఏపీకి ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధిపై విస్తృత స్థాయిలో చర్చలు జరిగాయని సీఎం చంద్రబాబు వివరించారు. యు-ఽవతకు ఉపాధి అవకాశాల సృష్టిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాబిన్ ఖుదాకు సీఎం చంద్రబాబు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగస్వామ్య అవకాశాలపై సుదీర్ఘంగా చర్చించామన్నారు. పర్యావరణ హిత, సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారించినట్లు చెప్పారు. అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీతో ఆంధప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలపాలని లక్ష్యంగా నిర్దేశిరచుకున్నట్లు రాబిన్ ఖుదాకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా డిజిటల్ ఆర్థిక వ్యవస్థ నిర్మాణంపై రాబిన్ ఖుదాతో చర్చించినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా సీఎం చంద్రబాబు వివరించారు.

# జనసేన పుట్టిందే తెలంగాణలో

- అందుకే ఇక్కడి ఎన్నికల్లో పోటీ చేస్తుంది
- ఇంకెంత కాలం ఆంధ్రావాళ్లను తిడతారు
- తెలంగాణ గడ్డపై నుంచే పోరాటం పుణికి పుచ్చకున్నా
- తెలంగాణ అంటే గౌరవంతోనే కొండగట్టుకు కోట్ల విరాళం
- తెలంగాణను వ్యతిరేకించిన వారే ఎమ్మెల్యేలుగా ఉన్నారు
- తెలంగాణకు ద్రోహం జరిగితే గొంతు లేపేది జనసేనే
- తెలంగాణపై తనకున్న ప్రేమ రాజకీయాలకు అతీతం
- ఎవరి తాటాకు చప్పళ్లకు భయపడేది లేదు
- మీడియా సమావేశంలో జనసేనాని పవన్ కళ్యాణ్ స్పష్టీకరణ

హైదరాబాద్,జూన్2(పద్మక్రాంతి):

తెలంగాణలో జనసేన పార్టీ ఉంటుందని ఆ పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించారు. తెలంగాణలో పోటీ చేస్తామని ఆయన కుండ బద్దలు కొట్టారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో పవన్ కల్యాణ్ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. దేశంలో అంతర్భాగం తెలంగాణ అని స్పష్టం చేశారు. తెలంగాణను వ్యతిరేకించిన వారే.. పదవుల్లో ఉన్నారని.. ఎమ్మెల్యేలు అయ్యారని పవన్ కల్యాణ్ వివరించారు. తెలంగాణ అంటే గౌరవం ఉంది కనుకే కొండగట్టు ఆలయానికి కోట్ల రూపాయిలు విరాళంగా ఇచ్చామన్నారు. మీ తాటాకు చప్పుళ్లకు జనసేన పార్టీ భయపడదన్నారు. భయపడేవాడినే అయితే పార్టీ పెడతానా? అని ప్రశ్నించారు. తెలంగాణకు ద్రోహం జరిగితే మొట్టమొదట గొంతులేపేది జనసేన పార్టీనే అని స్పష్టం చేశారు. ఏం చేసినా ఓట్ల కోసం కాదు.. తనకు తెలంగాణపై ప్రేమ, మమకారం ఉన్నాయన్నారు. గుంటూరులో టీఆర్ఎస్ కార్యాలయం పెడితే స్వాగతించామని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు.. ఇక్కడ ఏమైనా చేస్తే తాను సీఎం అయిపోతానా? అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. తెలంగాణను తానెప్పుడు అవమానించానని ఆయన స్థానిక నేతలను ప్రశ్నించారు. తన పీక కోసినా కూడా భయపడేది లేదన్నారు. తనకు రెచ్చగొట్టడం ఇష్టం లేదని తెలిపారు. తనను ఎన్ని తిట్టినా పట్టించుకోనన్నారు. తెలంగాణలో ఉపాధి లేకపోతే తాను కారణమా? అని రాజకీయ పార్టీల నాయకులను ఆయన సూటిగా నిలదీశారు. మద్రాస్‌లో ఉన్న చిత్రపరిశ్రమ ఇక్కడికి ఎలా వచ్చిందన్నారు. ఆంధ్రా వాళ్లను తిడుతుంటే వాళ్లు ఇక్కడెలా ఉంటారన్నారు. ఇంకెంతకాలం ఆంధ్రావాళ్లను తిడుతూ కాలక్షేపం చేస్తారంటూ తెలంగాణలోని నాయకులకు ఆయన సూటిగా ప్రశ్నించారు. సడెన్‌గా ఇక్కడికి రావొద్దంటే ఎలా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో ఏపీ కాంట్రాక్టర్లు బాగానే ఉన్నారన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తనకు గౌరవం ఉందన్నారు. తాను చెరువును కబ్జా చేశానని కొందరు అంటున్నారని.. అలా చేస్తే తనను ఇక్కడ ఉండనిస్తారా? అని ఆయన సూటిగా నిలదీశారు. తన



ఫామ్‌హౌస్ కబ్జా అని తేలిస్తే.. దానిని రాష్ట్ర ప్రభుత్వానికే రాసిస్తానన్నారు. గద్దర్‌తో తనకు చాలా సాన్నిహిత్యం ఉందని గుర్తు చేసుకున్నారు. రాజకీయాల్లోకి రాకముందే తనకు గద్దర్ తెలుసునన్నారు. గద్దర్ ఒంట్లో బుల్లెట్లు దిగినప్పుడు ఎందుకు మాట్లాడలేదని రాజకీయ పార్టీల నేతలను పవన్ కల్యాణ్ సూటిగా ప్రశ్నించారు. గద్దర్ తమ పార్టీ కార్యాలయానికి వచ్చేవారని గుర్తు చేశారు. గద్దర్ బతికున్నప్పుడు మీరంతా ఎక్కడున్నారు? అంటూ తనను ప్రశ్నిస్తున్న నేతలకు పవన్ కల్యాణ్ చురకలంటించారు.తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఉత్తేజం పొందామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తెలంగాణపై తనకున్న ప్రేమ రాజకీయాలకు అతీతమైనదన్నారు. తెలంగాణపై తనకు కొత్తగా వచ్చిన ప్రేమ కాదని పేర్కొన్నారు. 13వ ఏట అడుగుపెడుతున్న తెలంగాణకు శుభాకాంక్షలు తెలిపారు. లక్ష మందికిపైగా జనసేన నాయకులు, సైనికులు ఉన్న.. తెలంగాణలో కేడర్ తరఫున ప్రజలకు శుభాకాంక్షలు చెప్పారు. తెలంగాణలో జనసేన పార్టీ పుట్టిందని గుర్తు చేశారు. ఇక్కడి నాయకులంతా 2007-08 నుంచి.. అప్పటి యువరాజ్యంలో సభ్యులని వివరించారు. తెలంగాణ నలుమూలలా పెరిగిన వాడిని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తెలంగాణ బాగుండాలనే ఎప్పుడూ కోరుకున్నానని తెలిపారు. తన సినిమాల్లో తెలంగాణ స్ఫూర్తి కనిపిస్తుందని చెప్పారు. ఆదిలాబాద్ తాండాల్లో గడిపిన వాడిని.. ఆ తాండాల్లో దాహార్తి తీర్చిన వాడినని ఏపీ డిప్యూటీ సీఎం వివరించారు. తెలంగాణ విభజన తీరుకు తాము వ్యతిరేకమన్నారు. పార్లమెంట్ తలుపులు మూసి రాష్ట్ర విభజించిన తీరును ప్రశ్నించామని చెప్పారు. తనకు వారాహి యాత్రకు అనుమతి ఇచ్చింది తెలంగాణ అని వ్యాఖ్యానించారు. వైసీపీ తనను ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టనివ్వనంటే ఈ ప్రాంతం ఆదరించిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వివరించారు. ఆంధప్రదేశ్‌లోనే తాను అధికారం కోరుకోలే దన్నారు. అలాంటిది తెలంగాణలో ఎందుకు కోరుకుంటానని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు, నాయకులకు ఆంధ్రప్రదేశ్‌పై విద్వేషం లేదన్నారు. విద్వేషం చూపించి ఉంటే ఆ రాష్ట్ర ప్రజలు ఇక్కడ తిరిగేవారు కాదని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో తనకేం పని కొందరు ప్రశ్నిస్తున్నారన్నారు. మీరు ఎవరు తనను బెదిరించడానికి అని ప్రశ్నించారు. తెలంగాణ మీ అయ్య జాగీరా అని వారిని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ నిలదీశా-రు. తనపై దాడులు చేస్తామంటున్నారన్నారు. తనకు తెలంగాణలో కంటే ఏపీలోనే బెదిరింపులు అధికంగా ఉన్నాయని చెప్పారు. 2019 తాను ఓడిపోయినప్పుడు.. తెలంగాణ వాసులే.. ఇక్కడ ఆ పరిస్థితి రాదన్నారని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ గుర్తు చేసుకున్నారు. తెలంగాణలో జనసేన ఎదగాలని ఎంతగానో ఎదురుచూస్తున్నారని తెలిపారు. మీరు ఎన్ని తిట్లు తిట్టినా.. తన గుండెలో తెలంగాణ ఉంటుందని స్పష్టం చేశారు. వైసీపీ గూండాల బెదిరింపుల ముందు ఈ బెదిరింపులు ఓ లెక్కా? అని అన్నారు. ఓ విశ్లేషకుడు ఇక్కడ తన గురించి తప్పుగా మాట్లాడారని తెలిపారు. ఆ విశ్లేషకుడి వల్లే ఈ గొడవ మొదలైందన్నారు. ఆ వ్యాఖ్యలపైనే జనసేన సైనికులు స్పందించారని వివరించారు. కొన్ని చోట్ల కేసులు పెట్టారు.. అందులో తన ప్రమేయం లేదని స్పష్టం చేశారు. పార్టీ స్థాపించి 13 ఏళ్లు గడుస్తున్నా ఇంకా మేం నోరు మూసుకుని కూర్చోవాలా? అంటూ అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణలో మార్పు తప్ప మేం అధికారం కోరుకోవడం లేదని పేర్కొన్నారు. దేశంలో చాలా చోట్ల తెలుగువారు ఉన్నారని గుర్తు చేశారు. వాళ్లను అక్కడి నుంచి వెళ్లిపోమనడం కరెక్టేనా? అని ప్రశ్నించారు. ఇదిలావుంటే జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జూబ్లీహిల్స్ నివాసం వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఆయన నివాసం వద్దకు భారీగా అభిమానులు, జనసేన కార్యకర్తలు చేరుకున్నారు. పవన్ ఇంటి వరకు వారిని పోలీసులు అనుమతించకపోవడం, అలాగే, జనసేన తలపెట్టిన జన సంకల్ప సభకు అనుమతి నిరాకరించడంపై కార్యకర్తలు ఆందోళనకు దిగారు. పవన్ ఇంటివైపు వెళ్తున్న జనసేన శ్రేణులు, అభిమానులను పోలీసులు అడ్డుకుంటున్నారు. ప్రభుత్వం, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పవన్ నివాసం సమీపంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తెలంగాణ ప్రజలకు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జనసేన ఊపిరిలూదుకొన్నది తెలంగాణ గడ్డపైనేనని పేర్కొన్నారు. ఈ నేల నుంచే వారసత్వంగా పోరాట పటిమను పుణికి పుచ్చుకున్నదని చెప్పారు. తెలంగాణ సమున్నతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అణగారిన వర్గాల సంక్షేమం, యువత ఆకాంక్షలు, వ్యక్తి స్వేచ్ఛకు విఘాతం కలిగితే గళం వినిపించే తెగువ తెలంగాణలో ఉంది. ఆ లక్షణం జనసేన శ్రేణుల్లోనూ నిండుగా ఉంది. ఘనమైన చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపద విలసిల్లే తెలంగాణ రాష్ట్రం సమున్నతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నాను. తెలంగాణ కోసం బలిదానం చేసిన ప్రతి ఒక్కరికీ అంజలి ఘటిస్తున్నానని అన్నారు.

# జూన్ 4న కేరళలోకి నైరుతి రుతుపవనాలు

- దేశవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే ఛాన్స్
- దక్షిణాది రాష్ట్రాల్లో విస్తృతంగా వర్షాలు

న్యూఢిల్లీ,జూన్2(పద్మక్రాంతి):

దేశవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు స్వల్ప ఆలస్యంతో కేరళలోకి ప్రవేశించేందుకు సిద్ధమవుతున్నాయి. భారత వాతావరణ శాఖ తాజా అంచనాల ప్రకారం జూన్ 4న కేరళ తీరాన్ని రుతుపవనాలు తాకే అవకాశం ఉంది. దీంతో దేశంలో అధికారికంగా వర్షాకాలం ప్రారంభం కానుంది. రుతుపవనాల రాకతో దక్షిణ భారత రాష్ట్రాల్లో వచ్చే ఆరు నుంచి ఏడు రోజుల పాటు విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా కేరళలో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 7 సెంటీమీటర్ల నుంచి 20 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. అరేబియా సముద్రం మీదుగా తేమతో కూడిన గాలులు బలపడుతుండటంతో రుతుపవనాల కదలిక వేగవంతమవుతోంది. దీని ప్రభావంతో కేరళతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశముందని హెచ్చరించింది. అయితే రుతుపవనాల ప్రారంభంతో పాటు పలు ప్రాంతాల్లో ప్రతికూల వాతావరణ పరిస్థితులు కూడా ఏర్పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దేశంలోని వాయువ్య, మధ్య, తూర్పు ప్రాంతాలతో పాటు దక్షిణ ద్వీపకల్ప ప్రాంతాల్లో ఉర-ఽములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈదురుగాలుల వేగం గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వరకు ఉండవచ్చని అంచనా వేసింది. దీంతో విద్యుత్ స్తంభాలు, తాత్కాలిక నిర్మాణాలు, వ్యవసాయ పంటలకు నష్టం కలిగే అవకాశం ఉందని పేర్కొంది. ప్రజలు అప్రవ-ఽత్తంగా ఉండాలని, స్థానిక అధికారుల సూచనలు పాటించాలని సూచించింది. ఉత్తరాదిలోని ఢిల్లీ-ఎన్‌సీఆర్, రాజస్థాన్, పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లో ఇటీవల నమోదైన తీవ్ర ఎండల నుంచి ఉపశమనం కొనసాగనుంది. ఆ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. గత కొన్ని రోజులుగా అక్కడ గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టినట్లు తెలిపింది. అదేవిధంగా మధ్యప్రదేశ్, ఛ-త్తీస్‌గఢ్ వంటి మధ్య భారత రాష్ట్రాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశాలు కనిపిస్తున్నాయి. తూర్పు భారతదేశంలోని బిహార్, ఝార్ఖండ్, బంగాల్?లో రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వే-స్తున్నారు. ఇదిలా ఉండగా, తొలుత మే 26నే నైరుతి రుతుపవనాలు కేరళను తాకవచ్చునని ఐఎండీ అంచనా వేసింది. అయితే, ఆ అంచనాలను మే 29న సవరించి, తదుపరి వారంలో రావచ్చునని పేర్కొంది. మరోవైపు, వాతావరణంలో ఏర్పడిన ఎల్? నినో పరిస్థితుల వల్ల ఈసారి సాధారణం కంటే తక్కువ వర్షాలే కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. పసిఫిక్? మహా సముద్ర ప్రాంతంలో ఎల్ నినో పరిస్థితులు ఏర్పడుతున్నాయని, జూన్?లో అవి బలహీనంగా ఉన్నా సెప్టెంబర్?లో బలపడే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు, తీవ్రమైన ఎండల ప్రభావంతో దేశం వేడెక్కిపోతోంది. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రతకు బయటకు రావడానికి జనం బెంబేలెత్తిపోతున్నారు. అయితే, ఎండలతో అల్లాడిపోతున్న ప్రజానీకానికి మరికొన్ని రోజులపాటు నిరీక్షణ తప్పేలా లేదని వాతావరణ శాఖ చెబుతోంది. మరోవైపు, రెండుమూడు రోజుల తర్వాతైనా రుతుపవనాలు కేరళకు వస్తాయా అని కొందరు నిపుణులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఇక, రుతుపవనాల రాకతో వాతావరణ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కేరళలోని పలు ప్రాంతాల్లో ఆరెంజ్?, ఎల్లో అలర్ట్? జారీ చేశారు. మొ-ఽత్తం 9 జిల్లాల్లో ఎల్లో అలర్ట్? జారీ చేశారు. ఈ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.

# బీజేపీకి సింగం అన్నామలై గుడ్‌బై!

- తదుపరి కొత్త పార్టీ ఏర్పాటుపై దృష్టి
- సొంత పార్టీతో ఉపఎన్నికల్లో పోటీ!!

కోయంబత్తూరు, జూన్ 2(పద్మక్రాంతి):

తమిళనాడు రాజకీయాల్లో సంచలన మార్పు చోటుచేసుకుంది. దేశవ్యాప్తంగా ఎంతో క్రేజ్ సంపాదించుకున్న ఐపీఎస్ మాజీ అధికారి, తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కే. అన్నామలై ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్‌లను కలిసి తన 5 పేజీల రాజీనామా లేఖను సమర్పించారు. కొద్ది రోజులుగా అన్నామలై తదుపరి అడుగులపై సాగుతున్న ఉత్కంఠకు ఈ నిర్ణయంతో తెరపడింది. గత ఆరేళ్లుగా తమిళనాట బీజేపీకి 'స్టార్' ఇమేజ్ తెచ్చిన అన్నామలై, తాజాగా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌ను కలిసి రాజీనామా లేఖను అందజేశారు. ఐదు పేజీల సుదీర్ఘ లేఖలో ఆయన పార్టీ కేంద్ర నాయకత్వంతో తనకు ఉన్న వ్యూహాత్మక విభేదాలను స్పష్టంగా ప్రస్తావించినట్లు తమిళ మీడియా వర్గాలు చెబుతున్నాయి. ప్రత్యేకించి ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో ఏఐఏడీఎంకే తో పొత్తు పెట్టుకోవాలన్న ఢిల్లీ పెద్దల నిర్ణయంపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.



బీజేపీ స్వతంత్రంగా ఎదగాలని తాను కోరుకుంటే, అధిష్ఠానం మాత్రం ద్రావిడ పార్టీలపై ఆధారపడటాన్ని ఆయన జీర్ణించుకోలేకపోయా-ఽరు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక, సీట్ల కేటాయింపులో అన్నామలై అభిప్రా-ఽయాలను కేంద్ర నాయకత్వం పక్కన పెట్టింది. తనకు కేవలం ఆరు స్థానాల బాధ్యతలు మాత్రమే అప్పగించడంపై ఆయన తీవ్ర అసంతృప్తి చెందారు. ఫలితంగా జరిగిన ఎన్నికల్లో బీజేపీ కేవలం ఒక్క స్థానానికే పరిమితం కావడం, పార్టీ ఘోర పరాజయం పాలుకావడంతో అన్నామలై వాదన నిజమైంది. బీజేపీలో తనకు తగినంత స్వేచ్ఛ, భవిష్యత్తు లేవని భావించిన ఆయన, సుదీర్ఘ చర్చల అనంతరం కమలం గూటి నుంచి బయటకు రావడమే ఉత్తమమని భావించారు. అన్నామలై రాజకీయాల నుంచి తప్పుకోవడం లేదు, పైగా మరింత దూకుడు పెంచబోతున్నారు. రాబోయే ఉపఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా లేదా సరికొత్త వేదిక ద్వారా పోటీ చేసేందుకు ఆయన సన్నాహాలు చేసుకుంటున్నారు. రాబోయే 6 నుంచి 8 నెలల కాలంలో ఒక కొత్త ప్రాంతీయ పార్టీని స్థాపించే యోచనలో ఆయన ఉన్నారు. తమిళ అస్థిత్వం - జాతీయ దృక్పథం అనే సరికొత్త స్లోగన్‌తో, ఒక సెక్యులర్ ప్లాట్‌ఫామ్‌ను సిద్ధం చేయడమే ఆయన తదుపరి కార్యాచరణగా తెలుస్తోంది. ప్రముఖ నటుడు విజయ్ రాజకీయ అరంగేట్రం చేసి ఘనవిజయం సాధించడంతో తమిళనాడు రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ద్రావిడ పార్టీలైన డీఎంకే, ఏఐఏడీఎంకే , బీజేపీలకు ప్రత్యామ్నాయంగా ఒక కొత్త శక్తి వైపు యువత మొగ్గు చూపుతోందని అన్నామలై గమనించారు. బీజేపీ సిద్ధాంతాల ముద్ర వల్ల తమిళనాడులో ఎదగడం కష్టమని గ్రహించిన ఆయన, విజయ్ తరహాలోనే ద్రావిడ సంస్కృతి, అవినీతి రహిత పాలన అజెండాతో యువతను ఆకట్టుకోవాలని చూస్తున్నారు. ఇప్పటికే పలువురు యువ నిపుణులు, అసంతృప్త నేతలు ఆయనతో టచ్‌లోకి వెళ్లినట్లు సమాచారం.

తమిళనాడు బీజేపీకి అన్నామలై రాజీనామా చేయడం ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ. ఐపీఎస్ ఉద్యోగాన్ని వదిలి రాజకీయాల్లోకి వచ్చిన ఈ యు-ఽవనేత, ఇప్పుడు బీజేపీ చట్రం నుంచి బయటకు వచ్చి ఒంటరి పోరాటానికి సిద్ధమయ్యారు. కోయంబత్తూరుతో సహా తమిళనాడు అంతటా ఆయన మద్దతుదారులు ఇప్పటికే అన్నామలై 2.0 పోస్టర్లతో హల్‌చల్ చేస్తున్నారు. మరి ఈ సింగం సొంతంగా పార్టీ పెట్టి ద్రావిడ కోటలను బద్దలు కొడుతుందో లేదో చూడాలి.

బుధవారం, జూన్ 3, 2026

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి)
తెలుగు దినపత్రిక




## 'పెద్ది' కథ పడి లేచిన మనిషిది: బుచ్చిబాబు



దర్శకుడు బుచ్చిబాబు 'పెద్ది' గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇది కేవలం ఒక ఆటగాడి కథ కాదని, చుట్టూ ఉన్నవారిని మార్చే కథ అని తెలిపారు. అలాగే ఇది పడి లేచిన మనిషి కథ అంటూ పేర్కొన్నారు. ఈ సినిమా కోసం ఐదేళ్ల గ్యాప్ తీసుకున్నానని, రామ్ చరణ్ తన కథను ఎలాంటి మార్పులు లేకుండా అంగీకరించడం గొప్ప విషయమని ఎమోషనల్ అయ్యారు. సినిమా అవుట్‌పుట్‌పై నమ్మకం వ్యక్తం చేస్తూ, తాను 100 సార్లు చూసినా చివరి 40-50 నిమిషాలు ఎమోషనల్ అవుతానని చెప్పారు.

# రాజకీయాల్లోకి ధనుష్..!?



తమిళనాడులో సినిమా రంగానికి, రాజకీయాలకు దశాబ్దాల కాలంగా విడదీయరాని బంధం ఉంది. ఎంజీఆర్, జయలలిత, విజయ్‌కాంత్ నుంచి నిన్నటి దళపతి విజయ్ వరకు ఎంతోమంది సినీ తారలు ప్రజా క్షేత్రంలోకి వచ్చి నాయకులుగా రాణించారు. ఈ నేపథ్యంలో కోలీవుడ్ స్టార్ హీరో, జాతీయ అవార్డు గ్రహీత ధనుష్ కూడా భవిష్యత్తులో రాజకీయాల్లోకి వచ్చే అవకాశం ఉందా అనే చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. ఇటీవల విజయ్ 'తమిళగ వెట్రి కజగం' పార్టీని స్థాపించి 2026 అసెంబ్లీ ఎన్నికల్లో సంచలన విజయం సాధించిన ఈ తరుణంలో, ధనుష్ పొలిటికల్ ఎంట్రీపై ఆయన తండ్రి, ప్రముఖ సీనియర్ దర్శకుడు కస్తూరి రాజా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. చెన్నైలో జరిగిన ఒక సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న కస్తూరి రాజాకు, ధనుష్ రాజకీయ ప్రవేశంపై ఎదురైన ప్రశ్నకు ఆయన ఎంతో వ్యూహాత్మకంగా సమాధానమిచ్చారు. ఒకప్పుడు తమిళనాడు రాజకీయ దిగ్గజం కరుణానిధి జీవించిన గోపాలపురం, నేటి ముఖ్యమంత్రికి సంబంధించిన పోయస్ గార్డెన్ ప్రాంతాల ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ.. ప్రజాస్వామ్యంలో రాజకీయాల్లోకి ఎవరైనా రావచ్చునని, అది వారి వ్యక్తిగత ఇష్టమని పేర్కొన్నారు. తనకు వయసు అయిపోయింది కాబట్టి తాను రానని, కానీ భవిష్యత్తులో తన కొడుకులు ధనుష్, సెల్వరాఘవన్ లేదా తన మనవళ్లు కూడా రాజకీయాల్లోకి అడుగుపెట్టవచ్చని స్పష్టం చేస్తూ ఊహాగానాలకు మరింత బలాన్ని చేకూర్చారు. ఈ సందర్భంగా కస్తూరి రాజా తన పాత రోజులను గుర్తుచేసుకుంటూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.ఒకప్పుడు తేని జిల్లా నుంచి బతుకుదెరువు కోసం చెన్నై వచ్చేటప్పుడు తన చేతిలో కనీసం రూ. 50 కూడా లేవని, 19 ఏళ్ల వయసులోనే వివాహం జరగ్గా భార్య విజయలక్ష్మి ఇచ్చిన ప్రోత్సాహంతోనే దర్శకుడిగా నిలదొక్కుకున్నానని చెప్పారు. తమ కుటుంబ ఆర్థిక పరిస్థితిని పూర్తిగా మార్చిన చిత్రం ధనుష్ మొదటి సినిమా 'తుళ్లువదో ఇళమై' అని పేర్కొన్నారు. కెమికల్ ఇంజినీరింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన తన పెద్ద కొడుకు సెల్వరాఘవన్ 'కాదల్ కొండేన్' చిత్రంతో అద్భుతమైన దర్శకుడిగా మారాడని, అలాగే తన ఇద్దరు కుమార్తెలు కార్తీక, విమల గీత ప్రస్తుతం చెన్నైలో ప్రముఖ డాక్టర్లుగా సమాజానికి సేవలు అందిస్తున్నారని ఆయన గర్వంగా వెల్లడించారు. ఇక ధనుష్ విషయానికి వస్తే.. కేవలం నటుడిగానే కాకుండా దర్శకుడిగా, గాయకుడిగా, నిర్మాతగా తిరుగులేని క్రేజ్ సొంతం చేసుకున్న ఆయన, చాలా కాలంగా తన అధికారిక అభిమాన సంఘాల ద్వారా తమిళనాడు వ్యాప్తంగా విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా పేద విద్యార్థులకు విద్యా దానం, వరదల సమయంలో సహాయక చర్యలు, తన పుట్టినరోజు సందర్భాల్లో నిరుపేదలకు నిత్యావసర వస్తువుల పంపిణీ లాంటి సామాజిక కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో చేస్తున్నారు. ఈ గ్రౌండ్ వర్క్ అంతా భవిష్యత్తు పొలిటికల్ ఎంట్రీ కోసమేననే విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ధనుష్ కోలీవుడ్‌లోనే మోస్ట్ డిమాండ్ ఉన్న టాప్ స్టార్స్‌లో ఒకరిగా కొనసాగుతున్నారు. ఇటీవల 'సార్', 'రాయన్' వంటి చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద తన మార్కెట్ స్టామినాను నిరూపించుకున్న ఆయన, ఇటీవలి కాలంలో 'కుబేర' సినిమాతో పాటు 'ఇడ్లీ కడై', 'కర' సినిమాలు చేశారు. ఇప్పుడు తన ప్రాజెక్ట్ తో ఎంతో బిజీగా ఉన్నారు. ఇటు సినిమాలతో బాక్సాఫీస్ సామ్రాజ్యాన్ని ఏలుతూనే, అటు సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజలకు దగ్గరవుతున్న ధనుష్, భవిష్యత్తులో నిజంగానే పొలిటికల్ ఎంట్రీ ఇచ్చి తండ్రి మాటలను నిజం చేస్తారేమో చూడాలి.



## బోయపాటి శ్రీను, వెంకటేష్ కాంబోలో కొత్త సినిమా!

దర్శకుడు బోయపాటి శ్రీను, వెంకటేష్‌తో కలిసి కొత్త సినిమా చేయనున్నట్లు తెలుస్తోంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'తులసి' సినిమా సూపర్ హిట్ అయింది. ప్రస్తుతం వెంకటేష్ త్రివిక్రమ్, అనిల్ రావిపూడి దర్శకత్వంలో సినిమాలు చేస్తున్నారు. ఆ సినిమాలు పూర్తయిన తర్వాత బోయపాటితో సినిమాపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. బోయపాటి శ్రీను తన కెరీర్‌లో భారీ విజయాన్ని సాధించి, తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాల్సిన అవసరం ఉంది.

## దీపికాకు జాన్వీ స్ట్రాంగ్ కౌంటర్?

సినిమా పరిశ్రమలో ప్రస్తుతం అత్యంత చర్చనీయమైన అంశాల్లో వర్క్ కల్చర్ ఒకటి. ముఖ్యంగా బాలీవుడ్, టాలీవుడ్ ఇండస్ట్రీల్లో పని గంటలు, షూటింగ్ విధానం, ఆర్టిస్టులపై ఉండే ఒత్తిడి వంటి అంశాలపై తరుచు చర్చ జరుగుతునే ఉంటుంది. అయితే, ఈ చర్చకు కేంద్రబిందువుగా నిలిచింది బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె. స్పిరిట్, కల్కి 2 వంటి భారీ ప్రాజెక్ట్‌ల నుంచి ఆమె తప్పుకున్నారనే వార్తలు వచ్చిన తర్వాత.. పని గంటల వివాదం ఇండస్ట్రీ మొత్తం చర్చనీయంగా మారుతుంది.దీపికా పదుకొణె రోజుకు పరిమిత గంటలే పని చేయాలనే నిబంధన పెట్టారని, షూటింగ్ షెడ్యూల్స్ విషయంలో కొన్ని అభిప్రాయ భేదాలు తలెత్తాయని అప్పట్లో ప్రచారం జరిగింది. ఆ తర్వాత సోషల్ మీడియాలో టాలీవుడ్ వర్క్ కల్చర్‌పై రకరకాల కథనాలు వెలువడ్డాయి. ముఖ్యంగా టాలీవుడ్ లో రోజుకు 12 నుంచి 14 గంటల పాటు షూటింగ్‌లు జరుగుతాయని, ఆర్టిస్టులపై భారీ ఒత్తిడి ఉంటుందని కొందరు వ్యాఖ్యానించారు. అయితే, ఈ వివాదంపై తాజాగా బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ చేసిన వ్యాఖ్యలు కొత్త మలుపు తిప్పాయి.'దేవర' సినిమాతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన జాన్వీ కపూర్, ప్రస్తుతం రామ్ చరణ్ సరసన 'పెద్ది' సినిమాలో నటిస్తోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె టాలీవుడ్‌లో తనకు ఎదురైన అనుభవాలను పంచుకుంది. తెలుగు సినిమా సెట్స్‌లో సమయపాలనకు చాలా ప్రాధాన్యత ఇస్తారని, పనిగంటలను చాలా క్రమబద్ధంగా ప్లాన్ చేస్తారని ఆమె వెల్లడించింది. నటీనటులతో పాటు టెక్నీషియన్ల సంక్షేమాన్ని కూడా ఇక్కడ ఎంతో గౌరవిస్తారని పేర్కొంది. జాన్వీ మాటల్లో చెప్పాలంటే.. టాలీవుడ్‌లో లంచ్ బ్రేక్ అనేది కేవలం పేరుకే ఉండదట. ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా భోజనం చేసి, కాసేపు విశ్రాంతి తీసుకునేలా ప్రత్యేక సమయం కేటాయిస్తారట. ఆ తర్వాత మళ్లీ షూటింగ్‌లో పాల్గొనడం వల్ల పనితీరు మరింత మెరుగ్గా ఉంటుందని ఆమె అభిప్రాయపడింది. అంతేకాకుండా దేవర, పెద్ది సినిమాల షూటింగ్ సమయంలో తాను రోజుకు 9 గంటలకు మించి ఎప్పుడూ పని చేయలేదని స్పష్టం చేసింది.





# కొత్త మలుపు టీజర్ రిలీజ్

ప్రముఖ గాయని సునీత తనయుడు ఆకాష్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కొత్త మలుపు'. జూన్ 12న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. భైరవి ఆర్థ్యా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి శివ వరప్రసాద్ కేశనకుర్తి దర్శకత్వం వహించగా, తాటి బాలకృష్ణ నిర్మిస్తున్నారు. తథాస్తు క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మించిన ఈ మూవీని మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో చిత్ర టీజర్ లాంచ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సీనియర్ నటుడు భానుచందర్, ప్రముఖ గాయని సునీత, నిర్మాత సీ కళ్యాణ్, నటుడు రఘుబాబు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామీణ నేపథ్యంలోని రొమాంటిక్ ప్రేమకథగా తెరకెక్కిన ఈ చిత్రంలో ప్రేమ, సస్పెన్స్, వినోదం సమపాళ్లలో ఉంటాయని చిత్ర యూనిట్ తెలిపింది. ఆకాష్, భైరవి బావ--మరదళ్ల పాత్రల్లో కనిపించనున్నారు. రఘుబాబు, పృథ్వీ, ప్రభావతి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. యశ్వంత్ సంగీతం అందించారు. దర్శకుడు శివ వరప్రసాద్ కేశనకుర్తి మాట్లాడుతూ, "రొమాంటిక్ లవ్ సస్పెన్స్ జానర్‌లో ఈ సినిమాను రూపొందించాం. ఆకాష్--భైరవి జోడీ చాలా బాగా కుదిరింది. కోనసీమ అందాలను తెరపై ఆవిష్కరిస్తూ, మంచి కామెడీతో కూడిన కథను ప్రేక్షకులకు అందిస్తున్నాం. జూన్ 12న సినిమా విడుదల కానుంది" అన్నారు. "ఆకాష్ ఎంతో కష్టపడే వ్యక్తి. మంచి స్థాయికి చేరుకోవాలని కోరుకుంటున్నాను. ఇది అతనికి రెండో సినిమా. దర్శకుడు శివ ప్రేక్షకులకు వినోదాన్ని పంచే కథను తీసుకొచ్చారు. మైత్రి సంస్థ ఈ చిత్రానికి అండగా నిలవడం గర్వకారణం" అని సునీత అన్నారు.

సీనియర్ నటుడు భానుచందర్ మాట్లాడుతూ, "టీజర్ చాలా బాగుంది. హీరో, హీరోయిన్ ఇద్దరూ ఆకట్టుకున్నారు. ఈ చిన్న సినిమాను ప్రేక్షకులు పెద్ద విజయంగా నిలబెట్టాలి" అన్నారు. నిర్మాత తాటి బాలకృష్ణ మాట్లాడుతూ, "ఇది నాకు తొలి సినిమా. మా దర్శకుడికి తొలి చిత్రం. హీరోయిన్ కు తొలి సినిమా. హీరో ఆకాష్‌కు రెండో సినిమా. పూర్తిగా గ్రామీణ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి" అని తెలిపారు. హీరో ఆకాష్ మాట్లాడుతూ, "ఈ చిత్రానికి మంచి కథ అందించిన దర్శకుడికి కృతజ్ఞతలు. మైత్రి మూవీస్ వంటి సంస్థ మద్దతు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది. మా అమ్మ సునీతతో పాటు చిత్ర యూనిట్ అందరికీ ధన్యవాదాలు" అన్నారు. హీరోయిన్ భైరవి ఆర్థ్యా మాట్లాడుతూ, "నా కెరీర్‌లో 'కొత్త మలుపు' చాలా ప్రత్యేకమైన చిత్రం. ప్రేమ, సస్పెన్స్, హాస్యం కలగలిపిన ఈ కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది. ఆకాష్‌తో నా జోడీ, బావ--మరదళ్ల పాత్రలు ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తాయి" అని చెప్పారు.




Printed, Published and Owned by Ganji. Venkatesh, Printed At Nandini Printers H.NO . 3-29, Mankhal Village, Tukkuguda Muncipalty, Maheswaram Mandal, Ranga Reddy District - Pin Code 501359 And Published From H.NO. 3-29, Mankhal Village, Tukkuguda Muncipalty, Maheswaram Mandal, Ranga Reddy District - Pin Code 501359 Telangana State. Editor Ganji Venkatesh
RNI NO: TELTEL /2022/85167, Phone NO 9705347284, Email ID:Padmakranthi2022@gmail.com.